# ప్రజల ఆశీస్సులే జగనన్న ఆయుధం - మంత్రి

వడమాలపేట, మార్చి 13 ప్రభాతవార్త:



ప్రజల ఆశీస్సులే జగనన్న ఆయుధమని జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేసేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని మంత్రి రోజా అన్నారు. బుధవారం వడమాల పేటలో ఏర్పాటు చేసిన సిద్ధం సభలో ఆమె పాల్గొన్నారు. ఎస్‌బీ ఆర్‌పురం పంచాయతీలోని చెంచు వారి కాలనీలో 55 మందికి, ఏబీఆర్‌కాలనీలో 107 మందికి ఇళ్ళ పట్టాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల యుద్ధం ప్రారంభం కానుందని జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రి చేయడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. ప్రజాశీస్సులతో 175 స్థానాల్లోను వైసీపీ పార్టీ గెలుచుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. సమావేశంలో వడమాలపేట మండల ప్రజా ప్రతినిధులు, రెవెన్యూ అధికారులు, వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

# ఘనంగా ఎన్‌జేఆర్ విగ్రహావిష్కరణ



నేదురుమల్లి జనార్ధన్ రెడ్డి విగ్రహావిష్కరణ చేసిన మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

వాకాడు, మార్చి 13, ప్రభాతవార్త

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ డాక్టర్ నేదురుమల్లి జనార్ధన్ రెడ్డి రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చేతులు మీదుగా ఘనంగా విగ్రహావిష్కరించారు. నేదురుమల్లి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మాట్లాడుతూ మా పెద్దాయన లేని లోటు తీరని లోటని ఆయన ఎక్కడున్నా ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని కోరుకుంటున్నాను అన్నారు. ఈ విగ్రహావిష్కరణలో రామ్ కుమార్ రెడ్డితో పాటు గూడూరు వైకాపా ఇన్చార్జి మేరీగ మురళీ, మాజీ ఎమ్మెల్సీ మాదాసు గంగాధర్, ఎంపి గురుమూర్తి, ఎమ్మెల్సీ బల్లి కళ్యాన్, పొనక దేవసేనమ్మ, ఎల్లసిరి గోపాల్ రెడ్డి, ఎంఆర్‌సి రెడ్డి, దామోదర్ రెడ్డి, అజిత్ కుమార్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, పాపారెడ్డి రాజశేఖర్ రెడ్డి, హిమకుమార్ రెడ్డి, వైకాపా నాయకులు, అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.

# సింహాసనంపై కైలాసనాథుడు-కామధేను వాహనంపై అమ్మవారు



సింహాసనం, కామధేనువు వాహనాలపై స్వామిఅమ్మవార్ల దర్శనం

(శ్రీకాళహస్తి-ప్రభాతవార్త)

మహాశివరా త్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి సింహాసనం వాహనంపై కైలాసనాధుడు దివ్యాలంకారభూషితుడై పట్టణ ప్రజలకు దర్శనమిచ్చాడు. అలాగే అమ్మవారు కామధేను వాహనంపై తమభక్తులకు దర శ్శనమిచ్చారు. ఈ ఏడాది బ్రహ్మోత్సవాల వాహన సేవల్లో ఇది చివరిది. బ్రహ్మోత్సవాల ధ్వజావరోహణ అనంతరం స్వామి అమ్మవార్లను పట్టణంలో ఊరేగించటం ఆనవాయితి. ఆలయంలో ధ్వజావరోహణ కార్యక్రమాలు రాత్రి ఎనిమిది గంటల వరకు జరిగాయి. దాంతో ఉత్సవం ఆలస్యమైంది. ఆలయంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా యాగశాలలో ఏర్పాటు చేసిన కలశాలకు ప్రత్యేక పూజలుజరిపారు. తరువాత స్వామి గర్భగుడి ఎదురుగా శాస్త్రోక్తంగా పూజలు జరిపారు. అక్కడ ఏర్పాటు చేసిన హోమాలు, కలశాలల్లోని నీటితో స్వామి అమ్మవార్ల ఉత్సవర్లకు అభిషేకాలు జరిపారు. తరువాత స్వామి అమ మ్మవార్లను ఊరేగింపుకు అలంకార మండపంలో రాజేష్ గురుకుల్, సూరి గురుకుల్‌లు చక్కగా ముస్తాబు చేసారు. అక్కడ నుంచి ఆలయ సంప్రదాయం ప్రకారం పాతాళ వినాయక ఆలయం నుంచి శివయ్యగోపురం గుండా రాజగోపురం నుంచి స్వామి అమ్మవార్లను వాహనాల మండపం వద్దకు చేర్చారు. అక్కడ స్వామివారిని సింహాసనం వాహనంపై అమ్మవారిని సింహవాహనంపై ప్రతిష్టించారు. ఉత్సవంతో పాటు ధర్మకర్తల మండలిచైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు, ఇఓ ఎస్.వి నాగేశ్వరరావు, టెంపుల్ సూపరింటెండెంట్, ఉత్సవాల ఇన్‌చార్జి టెంపుల్ ఇన్స్పెక్టర్లు హరియాదవ్, సుదర్శనం దఫేదార్ రాజాలు తోడు రాగా సాగించారు.

## ధ్వజావరోహణం

శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిర్వహిస్తున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం సాయంత్రం ఆలయంలో ఈ నెల 4న ధ్వజారోహణకు సంబంధించి ధ్వజస్థంభంపై అధిరోహించిన భక్తులు సమర్పించిన చీరలను మళ్ళీ భక్తులకు చేర్పించుటకు ధ్వజావరోహణ కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమాలను సంప్రదాయబద్దంగా నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకులు డాక్టర్ స్వామినాధన్ గురుకుల్, పౌరోహితులు అర్ధగిరి స్వామి సారధ్యంలో నిర్వహించారు. అనంతరం స్వామి అమ్మవార్లకు అభిషేకం నైవేద్యం సమర్పించి ధ్వజావరోహణ కార్యక్రమా లను జరిపారు. ఈ కార్యక్రమాల్లో ఆలయ కార్యనిర్వహణాధికారి ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు, బోర్డు సభ్యులు, ప్రత్యేకాహ్వానితులు ఇఓ ఎస్.వి. నాగేశ్వరరావు, ఏఇఓ సతీష్‌మాలిక్, ఆలయ ఇన్స్పెక్టర్లు హరియాదవ్, సుదర్శనం, నాగభూషణం పాల్గొన్నారు.



ధ్వజావరోహణ కార్యక్రమాల్లో పూజలు

# కవయిత్రి మొల్ల జయంతి వేడుకలు

తిరుపతి కార్పొరేషన్, మార్చి 13, ప్రభాతవార్త



మొల్ల చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న కలెక్టర్ డా. జి. లక్ష్మీ షా

కవయిత్రి మొల్ల జయంతి సందర్భంగా స్థానిక కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో బిసి సంక్షేమ శాఖ వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీ షా పాల్గొని చిత్రపటానికి పూలమాల సమర్పించి పుష్పాంజలి ఘటించి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కవయిత్రి మొల్ల 1440 న కడప జిల్లా గోపవరం గ్రామంలో జన్మించారని అన్నారు. మొల్ల రామాయణాన్ని అతి సులువైన పదాలతో తెలుగులో రాసి తన సరళమైన పదజాలాన్ని ఉపయోగించారని తెలిపారు. మొల్ల రాసిన రామాయణం మొల్ల రామాయణంగా ఎంతో ప్రసిద్ధి చెందింది. రామాయణాన్ని తెలుగులో రాసిన తొలి కవయిత్రిగా పేరు ప్రఖ్యాతలు గాంచింది అని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మొల్ల జయంతిని ప్రభుత్వ కార్యక్రమంగా జిల్లా స్థాయిలో చేపట్టాలని ఇచ్చిన రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం జిల్లా స్థాయి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బిసి సంక్షేమ అధికారి భాస్కర్ రెడ్డి, జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ అధికారి బాలకొండయ్య తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధికి చిరునామా వైకాపా ప్రభుత్వం: మంత్రి పెద్దిరెడ్డి

రొంపిచెర్ల, మార్చి13 ప్రభాతవార్త

రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధ్యక్షతన ఉన్న వైకాపా ప్రభుత్వం అభివృద్ధికి చిరునామాగా మారిందని రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. బుధవారం ఆయన రొంపిచెర్ల మండలంలో పర్యటించారు. ఈసందర్భంగా రూ.2.60 కోట్లతో జాండ్లవారిపల్లెలో ఏర్పాటు చేసిన విద్యుత్ సబ్‌స్టేషన్‌ను, రూ.2.65 కోట్లతో చెంచంరెడ్డిగారిపల్లెలో ఏర్పాటు చేసిన విద్యుత్ సబ్‌స్టేషన్‌లను ఆయన ప్రారంభించారు. అనంతరం బండకిందపల్లెలో రూ.47లక్షలతో నిర్మించిన నూతన పాఠశాల భవనాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఆయన వెంట ఎంపీపీ చిచ్చిలి పురుషోత్తంరెడ్డి, జడ్పీటీసీ రెడ్డీశ్వరరెడ్డి, తితిదే మాజీ సభ్యుడు పోకల అశోక్‌కుమార్, సింగిల్‌విండో అధ్యక్షుడు హరినాధరెడ్డి,,మండల కన్వీనర్ ఇబ్రహీంఖాన్, ఎంపీడీఓ రెడ్డెప్పఆచారి, తహశీల్దారు ,సర్పంచిలు నాగిరెడ్డి,ప్రసాద్‌నాయుడు, సుధారాణి, అన్సర్‌భాషా, ఎంపీటీసీలు లక్ష్మీకమలాకరరెడ్డి, కరీముల్లా, వైకాపా నాయకులు,సూర్యనారాయణరెడ్డి, కోటా వెంకటరమణ,భాస్కరరెడ్డి, కమలాకరరెడ్డి,పలువురు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## దర్శనాల కోసం డబ్బులు వసూలు చేసి...

# ఇద్దరు సిబ్బంది సస్పెన్షన్

కాణిపాకం, మార్చి 13 ప్రభాతవార్త:

కాణిపాకం ఆలయ దర్శనార్థం వచ్చిన భక్తుల నుండి డబ్బులు వసూలు చేసుకుని అక్రమంగా దర్శనానికి పంపిన ఇద్దరు సిబ్బందిని గురువారం ఆలయ అధికారులు సస్పెండ్ చేశారు. వివరాల్లోకి వెళితే... సత్య ప్రమాణాలకు నెలవైన కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారి ఆలయంలో వారంతపు రోజుల్లో తీవ్రస్థాయిలో రద్దీ వుంటుంది. ఇదే అదనుగా చూసుకుని ఆలయంలో పనిచేసే సిబ్బంది తమ చేతివాటంను ప్రదర్శించి వేలాది రూపాయలు అక్రమంగా ఆర్జిస్తున్నారు. ఈమేరకు ఈనెల 10న ఆదివారం 150 రూపాయల టిక్కెట్ కౌంటర్ వద్ద విధులు నిర్వహిస్తున్న రోజువారి వేతన ఉద్యోగి విజాయవాడకు చెందిన భక్తుల నుండి వెయ్యి రూపాయలు తీసుకుని టిక్కెట్ ఇవ్వకుండా ఏడు మంది భక్తులను స్వామివారి దర్శనానికి పంపారు. అలాగే ఈనెల 11న 100 రూపాయలు టిక్కెట్ క ౌంటర్ వద్ద విధులు నిర్వహిస్తున్న హోంగార్డు తిరువణ్ణామలైకు చెందిన నలుగురు భక్తుల వద్ద నుండి 800 రూపాయలు తీసుకుని అక్రమంగా ఆలయంలోకి అనుమతించారు. ఈవిషయాన్ని భక్తులే నేరుగా ఆలయ ఈఓకు ఫిర్యాదు చేయడంతో సీసీ కెమెరాల పుటేజిని పరిశీలించగా వాస్తవమని గుర్తించారు. ఈమేరకు విచారించి వారిద్దరికి సస్పెండ్ చేసినట్టు ఆలయ ఈఓ వెంకటేశు తెలిపారు. భక్తులు దళారులను నమ్మవద్దని, టిక్కెట్ కొనుగోలు చేసి స్వామి దర్శనానికి రావాలని తెలిపారు. ఎవరైనా డబ్బులు అడిగితే తమకు సమాచారం అందించాలని ఈఓ తెలిపారు.

# కేంద్ర సాయుధ బలగాలతో పోలీసు కవాతు





తిరుపతినగరంలో పలు పోలింగ్ కేంద్రాల పరిధిలో కవాతు నిర్వహిస్తున్న కేంద్ర సాయుధ బలగాలు

తిరుపతి క్రైం, మార్చి 13, ప్రభాతవార్త

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జిల్లాలోని పలు క్లిష్టమైన పోలింగ్ కేంద్రాల పరిధిలో కేంద్ర సాయుధ బలగాలతో పోలీసు కవాతు జిల్లా పోలీసులు బుధవారం నిర్వహించారు. తిరుపతి ఈస్ట్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఈస్ట్ సిఐ మహేశ్వర్ రెడ్డి, ఎస్ఐ శ్రీకాంత్ రెడ్డి వారి ఆధ్వర్యంలో ఫ్లాగ్ మార్చ్ కొర్లగుంట నుండి ప్రారంభించి సంజయ్ గాంధీ కాలనీ, కొత్తపల్లి, స్కావెంజర్స్ కాలనీ మీదుగా అశోక్ నగర్ వరకు ఉన్న సంక్లిష్ట పోలింగ్ కేంద్రాల ప్రాంతాలలో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించి ఓటర్లను చైతన్యవంతులు చేసి ధైర్యాన్ని నింపారు.

# ఆధ్యాత్మిక శోభను కల్పిస్తాం

## ధర్మకర్తల మండలి మొదటి సమావేశంలో తీర్మానాలు

శ్రీకాళహస్తి,మార్చి 13 ప్రభాతవార్త

శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా ఉన్న పరిసరాల్లోని ఆలయాలకు ఆధ్యాత్మిక శోభను కల్పించి గత పాలకమండలిలో చేపట్టి అసంపూర్తిగా ఉన్న పనులను పూర్తి చేద్దామని బుధవారం జరిగిన మొదటి ధర్మకర్తల మండలి సమావేశంలో చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు అన్నారు. ఈ నెల 8న మహాశివరాత్రి పర్వదినాన కొత్త ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకారం చేసారు. ఈ ధర్మకర్తల మండలి సమావేశం బుధవారం చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు సారధ్యంలో నిర్వహించగా ఆలయ ఇఓ వి.యస్ నాగేశ్వరరావు, ఇఇ నూకారత్నంలు పర్యవేక్షించారు.ఈ సమావేశంలో నూతనంగా ఎంపికైన సభ్యులు పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా చైర్మెన్ పలు అంశాలను ప్రవేశ పెట్టారు.వాటిని సమావేశం ఏకగ్రీవంగా ఆమోదించారు. ఆలయానికి అనుబంధంగా సహస్రలింగేశ్వరస్వామి వేయిలింగాల కోనను సర్వాంగ సుందరంగా తీర్చి దిద్దుటకు ఇక్కడ వెలసిన వేయిలింగాల స్వామి వద్దకు గతంలో చేపట్టి ఆగిన రోడ్డు నిర్మాణాన్ని పరిశీలించుటకు అధికారులకు సూచించారు.కాగా గిరి ప్రదక్షిణ మార్గంలో ఎదురు సేవ మండపం వద్ద ఉన్న వినాయక ఆలయం శిధిలావస్థ దశలో ఉందని దానిని పునర్నిర్మాణానికి సంబంధించి అంచనా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ధర్మకర్తల మండలి తీర్మానం చేసింది. కాగా పట్టణంలోని ఏనుగుల గుంట వద్ద ఉన్న స్వామి అమ్మవార్ల విడిది మండపం పునర్నిర్మాణానికి తీర్మానం చేసారు. గాలిగోపురం పక్కన తేరువీధి నుంచి దిగువ సన్నిధివీధి వరకు కొత్తగా నిర్మించిన గ్రావెల్ రోడ్డును సిమెంటు రోడ్డుగా మార్చుటకు బిక్షాల గాలి గోపురం నుంచి శ్రీరామమందిరం వరకు రోడ్డును వెడల్పు చేసి మధ్యలో డివైడర్లు ఏర్పాటుకు సమావేశం తీర్మానించారు.కొత్తపేటలోని స్వామి విడిది మండపాన్ని ఆధునీకరించుటకు దేవస్థానం కు సంబంధించిన నెప్పాళ మండపాన్ని నిర్మించుటకు తీర్మానించారు. పట్టణంలో సైరన్ కొనుగోలుకు,భరద్వాజ తీర్థంలో ఆధునిక పార్కులను తిరుమల స్థాయిలో తీర్చి దిద్దుటకు తీర్మానించారు. ఆధునిక సదుపాయాలతో సాంకేతిక పరిజ్ఞానంతో లైటింగ్ ఏర్పాటు చేయాలని తీర్మానించారు. సభ్యులు వివిధ ప్రతిపాదనలను చేసారు. ఇఓ నాగేశ్వరరావు, డెప్యూటీ ఇఓ ఏకాంబరం,కృష్ణారెడ్డి, ఇఇ నూకరత్నం, డిఇఇ శ్రీనివాసులు రెడ్డి, ఎఇఓలు సతీష్‌మాలిక్, ధనపాల్,లోకేష్‌రెడ్డి, సూపరింటెండెంట్‌లు శ్రీహరి, ఎఇఇలు రాజేశ్వరి, పవన్‌కుమార్, ఎలక్ట్రికల్ ఎఇఇ మురళీధర్,సబ్ టెంపుల్ ఇన్‌చార్జి లక్ష్మయ్య, స్థపతి కుమార్,బోర్డు సభ్యులు, ప్రత్యేకాహ్వానితులు పాల్గొన్నారు.



బోర్డు సమావేశం

# ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేలా చర్యలు

## జిల్లా కలెక్టర్లు, ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్‌లో సిఈఓ

తిరుపతి కార్పొరేషన్, మార్చి 13, ప్రభాతవార్త

రీపోల్‌కు అవకాశం లేకుండా ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేలా చర్యలు చేపట్టాలని సిఈఓ ముఖేష్ కుమార్ మీనా పేర్కొన్నారు. విజయవాడ చీఫ్ ఎలక్టోరల్ అధికారి కార్యాలయం నుండి బుధవారం పెండింగ్ ఫామ్‌ల పురోగతి, తొలగింపులు, ఎపిక్ కార్డుల ముద్రణ, పంపిణీ స్థితి శిక్షణా కార్యక్రమాలు, ఫిర్యాదులు, ప్రతికూల వార్తలు, డిఈఎంపి, జిల్లా కంట్రోల్ రూమ్, సోషల్ మీడియా సెల్ ఏర్పాటు, ఫిర్యాదు నిర్వహణ వ్యవస్థ, నివేదిక నిర్వహణ వ్యవస్థ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీల నుండి జిల్లా నోడల్ అధికారులు నియామకం, ఎన్నికల ప్రవర్తనా నియమావళి, పలు నివేదికలు తదితర అంశాలపై జిల్లా కలెక్టర్లతో, ఎస్పిలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. అనంతరం తిరుపతి కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా.జి. లక్ష్మీ షా, ఎస్పీ కృష్ణకాంత్ పటేల్ సంబంధిత ఈఆర్ఓలతో కలిసి వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైయ్యారు. ఈ సందర్భంగా సిఈఓ మాట్లాడుతూ క్లెయిమ్స్ అండ్ అబ్జెక్షన్స్ బియాండ్ ఎస్ఎల్ఎకు వెళ్లకుండా త్వరితగతిన నిబంధనల మేరకు పూర్తి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో తిరుపతి ఈఆర్ఓ అధితి సింగ్, అదనపు ఎస్పి వెంకట్రావు, డిఆర్ఓ పెంచల్ కిషోర్, ఈఆర్ఓలు కరణ్ కుమార్, రవి శంకర్ రెడ్డి, చంద్రముని, రామ్మోహన్, కలెక్టరేట్ ఎన్నికల తహశీల్దార్ చంద్రశేఖర్, పవన్‌లు పాల్గొన్నారు.





# గత ఐదేళ్లలో 22,217 ఎన్నికల బాండ్ల జారీ

## సుప్రీంకు ఎస్‌బిఐ అఫిడవిట్




**న్యూఢిల్లీ, మార్చి 13:** రాజకీయ పార్టీలకు నిధులు సమకూర్చిన ఎన్నికల బాండ్ల వివరాలను భారతీయ స్టేట్ బ్యాంకు బుధవారం సుప్రీంకోర్టుకు తెలిపింది. న్యాయస్థానం ఆదేశాల మేరకు ఈ డేటాను ఎస్‌బిఐ మంగళవారం కేంద్ర ఎన్నికల సంఘానికి అందచేసిన విషయం విదితమే. తాజాగా దీనిపై బ్యాంకు సర్వోన్నత న్యాయస్థానానికి అఫిడవిట్ సమర్పించింది. ఏప్రిల్ 1, 2019 నుంచి ఈ యేడాది ఫిబ్రవరి 15 వరకు మొత్తంగా 22,217 ఎన్నికల బాండ్లను జారీచేసినట్లు వెల్లడించింది. 'కోర్టు ఆదేశాల మేరకు గత ఐదేళ్లలో మేం జారీ చేసిన ఎన్నికల బాండ్లకు సంబంధించిన అన్ని వివరాలను మార్చి 12న ఇసికి ఇచ్చాం. ఈ బాండ్లను ఎవరెవరు ఎంత కొనుగోలు చేశారు? ఏ పార్టీలు ఎంత ఎన్‌క్యాష్ చేసుకున్నాయి? వంటి వాటిని అందించాం' అని ఎస్‌బిఐ చైర్మన్ దినేశ్ కుమార్ అఫిడవిట్ సమర్పించారు. గత నెల ఎన్నికల బాండ్ల పథకాన్ని సుప్రీంకోర్టు రద్దు చేసిన విషయం విదితమే. 2019 ఏప్రిల్ 1వ తేదీ నుంచి ఫిబ్రవరి 15, 2024 వరకు మొత్తం 22,217 ఎన్నికల బాండ్లను దాతలు కొనుగోలుచేసినట్లు ఎస్‌బిఐ తమ అఫిడవిట్‌లో పేర్కొంది. ఇందులో 22,030 బాండ్లను పలు రాజకీయ పార్టీలు ఎన్‌క్యాష్ చేసుకుని నిధులు తీసుకున్నట్లు తెలిపింది. మిగతా 187 బాండ్లను నిబంధనల ప్రకారం రిడీమ్ చేసి ప్రధానమంత్రి జాతీయ సహాయ నిధిలో డబ్బు జమ చేసినట్లు వెల్లడించింది. అయితే వీటితో ఏ పార్టీకి ఎన్ని నిధులు దక్కాయన్నదానిపై ప్రస్తుతానికి పూర్తి స్పష్టత లేదు. సర్వోన్నత న్యాయస్థానం ఆదేశాల ప్రకారం, ఈ నెల 15 సాయంత్రం 5 గంటల్లోగా ఇసి ఈ సమాచారాన్ని వెబ్‌సైట్‌లో బహిరంగపరచాల్సి ఉంది.

కేంద్ర ప్రభుత్వం 2019లో ఎన్నికల బాండ్ల పథకాన్ని తీసుకొచ్చినప్పటి నుంచి ఈ యేడాది ఫిబ్రవరి వరకు 30 విడతల్లో ఎస్‌బిఐ వీటిని విక్రయించింది. వ్యక్తులు/సంస్థలు వీటిని కొనుగోలు చేసి అర్హత కలిగిన రాజకీయ పార్టీలకు నిధుల కింద అందించాయి. నిబంధనల ప్రకారం, జారీ అయిన తేదీ నుంచి 15 రోజుల వరకే ఇవి చెల్లుబాటవుతాయి. ఆలోగా రాజకీయ పార్టీలు వాటిని ఎన్‌క్యాష్ చేసుకోవాలి. గడువు ముగిసిన తర్వాత మిగిలిపోయిన బాండ్లకు చెందిన నగదును పిఎం రిలీఫ్ ఫండ్‌కు జమ చేస్తారు.



## విశ్వాసపరీక్షలో నెగ్గిన హర్యానా కొత్త సిఎం సైనీ

**ఛండీఘర్, మార్చి 13:** హర్యానా కొత్తముఖ్యమంత్రి నాయబ్‌సింగ్ సైనీ అసెంబ్లీలో నిర్వహించిన విశ్వాస పరీక్షలో నెగ్గారు. బిజెపి, దుష్యంత్ చౌతాలా జెజెపి పార్టీల బ్రేకప్‌కారణంగా ఏర్పడిన కొత్తప్రభుత్వంలో సిఎంకు 48 మంది ఎమ్మెల్యేల మద్దతు లభించింది. వాస్తవానికి మెజార్టీ మార్కు 46 అయినా 48 మంది మద్దతిచ్చారు. మనోహర్‌లాల్‌ఖట్టర్ ఆకస్మిక రాజీనామాతో కొత్త సిఎంఎంపిక, కొత్తప్రభుత్వం ఏర్పాటు అనివార్యం అయింది. బుధవారం జరిగిన అసెంబ్లీ ప్రత్యేక సమావేశంలో విశ్వాసపరీక్ష నిర్వహించిన సంగతి తెలిసిందే. విప్ జారీచేసిన ఎమ్మెల్యేలతోపాటు జెజెపికి చెందిన నలుగురు ఎమ్మెల్యేలు జోగిరామ్‌సిహాగ్, ఈశ్వర్‌సింగ్; రామ్‌కుమార్ గౌతమ్, దేవేంద్ర బబ్లిలు అసెంబ్లీకి వచ్చారు. ఆ తర్వాత నలుగురు జెజెపి ఎమ్మెల్యేలు, ఒక స్వతంత్ర ఎమ్మెల్యే బాల్‌రాజఖ్ కుందులు సభను వీడి వెళ్లిపోయారు. 90 మంది అసెంబ్లీలో బిజెపికి 41 మంది సభ్యులున్నారు. మొత్తం ఏడుగురు స్వతంత్ర ఎమ్మెల్యేల్లో ఆరుగురి మద్దతు లభించింది. హర్యానా లోక్‌హిత్ పార్టీ ఎమ్మెల్యే గోపాల్ కందా మద్దతును కూడా సాధించారు. జెజెపికి అసెంబ్లీలో పది మంది ఎమ్మెల్యేలున్నారు. ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్ పార్టీకి 30 మంది ఎమ్మెల్యేలున్నారు.

ఐఎన్‌ఎల్‌డికి ఒక ఎమ్మెల్యే ఉన్నారు. ఉదయం పదిగంటలకే అసెంబ్లీప్రత్యేక సమావేశం ప్రారంభించారు. ఖట్టర్ ఇతర బిజెపి ఎమ్మెల్యేలు ఈ కీలక సమావేశానికి హాజరయ్యారు. మాజీ హోం మంత్రి ఆరుపర్యాయాలు ఎమ్మెల్యేగా నిలిచిన అంబాలా కంటోన్మెంట్ ఎమ్మెల్యే అనిల్‌విజ్‌కు కొత్త కేబినెట్‌లో బెర్త్ లభించలేదు. అంతే కాకుండా సిఎం సైనీ ప్రమాణస్వీకారానికి కూడా రాలేదు. 54 ఏళ్ల ఒబిసి నేత హర్యానా బిజెపి చీఫ్ సైనీచేత గవర్నర్ బండారు దత్తాత్రేయ ప్రమాణంచేయించారు. రానున్నలోక్‌సభ ఎన్నికల్లో ఖట్టర్‌ను ఏదో ఒక నియోజకవర్గంనుంచి పోటీచేయిస్తారని తెలుస్తోంది. జెజెపి రాష్ట్రంలోని పది లోక్‌సభ స్థానాలు, 90 అసెంబ్లీ స్థానాలకు కూడా తమ పార్టీ పోటీచేస్తుందని ప్రకటించింది.

## ప్రముఖ నవలారచయిత అరుణ్‌గోస్వామి కన్నుమూత

**గువాహతి, మార్చి 13:** ప్రముఖ నవల, లఘుకథా రచయిత ఆరుణ్‌గోస్వామి(80) కన్నుమూసారు. సుదీర్ఘకాలంగా ఆయన అస్వస్థతతో బాధపడుతున్నారు. జోర్హట్‌లోని మిషన్ ఆసుపత్రిలో చేర్చిన గోస్వామి చికిత్స పొందుతూనే కన్నుమూసినట్లు గోస్వామి కుటుంబ సభ్యులు తెలిపారు. అస్సాంలోని డేర్గాంవ్‌లో జన్మించిన గోస్వామి తన పొట్టికథలకు, నవలలకు ఎంతో ప్రాచుర్యం లభించింది. పదివేల పేజీలతో రచించిన పుస్తకానికి ఆయనకు ప్రపంచ రికార్డుకూడా లభించింది. ఆయన రచనలన్నీ కూడా సామాజిక బాధ్యతతో కూడుకుని ఉంటాయి. అస్సాంలో నెలకొన్న కల్లోలిత సమస్యపైనే ఆయన ఎక్కువ రచనలుచేసారు. ఆయన రచనల్లో కలక్షణ, శలాంతా బిబోరిని వంటివి మంచి గుర్తింపు పొందాయి. తన సాహితీ రచనలతోపాటు గోస్వామి రాజకీయ విశ్లేషకునిగా కూడా పేరుపొందారు. ఆయన చేసిన విశ్లేషణలకు రాజకీయనాయకులుసైతం విస్మయం వ్యక్తంచేసేవారు. రాష్ట్ర, జాతీయ స్థాయిలో ఆయన చేసిన విశ్లేషణలు విస్తృత ప్రాచుర్యం పొందాయి.

## లోక్‌సభ ఎన్నికలలో పోటీకి ఖర్గే విముఖత

### వయసు మీదపడిందని వాఖ్య



**న్యూఢిల్లీ, మార్చి 13:** కాంగ్రెస్ పార్టీ సీనియర్లు ఒక్కొక్కరుగా ప్రత్యక్ష ఎన్నిలకు దూరమవుతున్నట్లు వార్తలు వస్తున్న విషయం తెలిసిందే. పార్టీ అధినేత మల్లికార్జునఖర్గే సహా సీనియర్లు దిగ్విజయ్‌సింగ్, అశోక్‌గెహ్లాట్, హరీశ్‌రావత్, కమల్‌నాథ్, రాజస్థాన్ మాజీ ఉపముఖ్యమంత్రి సచిన్ పైలట్ వంటి సీనియర్ నేతలు లోకసభ ఎన్నికల్లో పోటీచేయవద్దని నిర్ణయించుకున్నట్లు జాతీయ మీడియాలో వరుస కథనాలు వెలువడ్డాయి. అయితే ఈ వార్తలను కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జునఖర్గే తాజాగా తోసిపుచ్చారు. మీతో సహా సీనియర్ నాయకులు లోక్‌సభ ఎన్నికల్లో పోటీకి దూరంగా ఉంటున్నారు కదా? అని ఖర్గేని మీడియా ప్రశ్నించింది. అందుకు ఖర్గే వయసు కారణంగా చెప్పారు. సీనియర్లు పోటీ నుంచి తప్పుకుంటున్నారన్న వార్తల్లో నిజం లేదని, తనవయసు ఇప్పుడు 83యేళ్లని, వయోభారం కారణంగానే ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. అయితే కార్యకర్తలు కనుక పోటీచేయాల్సిందేనని పట్టుబడితే మాత్రం చెయ్యక తప్పదని పేర్కొన్నారు. ఇప్పుడు నా వయసు 83 యేళ్లు. మీరు 65 యేళ్లకే రిటైర్ అవుతారు. అలాగే నేను 83 యేళ్ల వయసులో ఈ నిర్ణయం తీసుకున్నానన్నారు. ఒకవేళ ఈసారి ఎన్నికల్లో దిగితే సొంత నియోజకవర్గం గుల్బర్గా నుంచి పోటీ చేస్తారా? అని మీడియా ప్రశ్నించగా అధిష్టానం ఆదేశిస్తే తప్పకుండా అని బదులిచ్చారు. పార్టీ కార్యకర్తలు ఒత్తిడి చేస్తే మాత్రం బరిలోకి దిగక తప్పరు. కొన్నిసార్లు పార్టీని ముందుండి నడిపిస్తే, మరికొన్నిసార్లు వెనుక నుండి నడిపించాల్సి ఉంటుంది. తమకు అందిన జాబితాలో ఒకేస్థానం నుంచి పోటీకి పదేసిమంది రెడీగా ఉన్నారు. అని ఖర్గే అన్నారు. కాగా, ఖర్గే 2009, 2014 లోక్‌సభ ఎన్నికల్లో గుల్బార్గా నుంచి ఎంపిగా పోటీకి దిగు గెలుపొందిన విషయం తెలిసిందే. అయితే 2019లో జరిగిన ఎన్నికల్లో మాత్రం ఓటమి పాలయ్యారు. తాజా ఎన్నికల్లోసోనియా గాంధీ, రాహుల్ గాంధీ సహా కాంగ్రెస్ నేతలను సంప్రదించిన తర్వాతే ఎన్నికల్లో పోటీచేయాలా వద్దా అనే అంశంపై ఖర్గే తుది నిర్ణయం తీసుకునే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

## సిఎఎతో భారత్‌లోకి వలసలు పెరుగుతాయి

### ఢిల్లీ సిఎం అరవింద్ కేజ్రీవాల్



**న్యూఢిల్లీ, మార్చి 13:** పౌరసత్వ సవరణ చట్టం అమలుపై ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ కేంద్ర ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. ఎన్నికలకు ముందు ఓటు బ్యాంకు రాజకీయాలే లక్ష్యంగా కేంద్రం సిఎఎను అమల్లోకి తెచ్చిందని విమర్శించారు. ఇదో మురికి ఓటు బ్యాంకు రాజకీయ. పాకిస్థాన్, బంగ్లాదేశ్ నుంచి వచ్చిన వలసదారులకు పౌరసత్వం ఇచ్చిన వారికి బిజెపి బలహీనంగా ఉన్న నియోజకవర్గాల్లో ఆశ్రయం కల్పిస్తుంది. దీనివల్ల భవిష్యత్‌లో బిజెపికి ఓటు బ్యాంకు పెరుగుతుంది. వారిరాజకీయ ప్రయోజనాల కోసమే కేంద్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని మండిపడ్డారు. ఇప్పటికే దేశంలో ఉన్న నిరుద్యోగం, ద్రవ్యోల్బణం సమస్యలను పరిష్కరించకుండా కేంద్రం సిఎఎగురించి మాట్లాడుతోంది. 2014కు ముందు భారత్‌కు వచ్చిన వారికి పౌరసత్వం ఇస్తామంటున్నారు. కాని ఒకసారి తలుపులు తెరిచిన తరువాత మిగిలిన వారు ఊరుకుంటారా, పెద్ద సంఖ్యలో వలసదారులు భారత్‌లోకి రావడం ప్రారంభిస్తారు. మూడు దేశాల్లో 30 మిలియన్లకు పైగా మైనారిటీలు నివసిస్తున్నారు. 15 మిలియన్ల మంది భారత్‌కు వచ్చినా వారు ఎక్కడ స్థిరపడతారు. వారికి ఉద్యోగాలు ఎవరు ఇస్తారు. ఇది దేశానికి ప్రమాదకరం. ముఖ్యంగా ఈశాన్య రాష్ట్రాలు ప్రభావితం అయ్యే అవకాశముందన్నారు. ఇప్పటికే బంగ్లాదేశ్ నుంచి అక్రమ వలసదారులు రావడం వల్ల అస్సాం ప్రజల భాష, సంస్కృతి ఇబ్బందుల్లో పడ్డాయని, ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. వలసదారులకు పౌరసత్వం ఇవ్వడం వల్ల దేశంలోని యువతకు అందాల్సిన ఉద్యోగావకాశాలు వారికి దక్కుతాయి. వారికి ఉద్యోగాలు ఇస్తారు. ఇళ్లు కట్టిస్తారు. మరి మన దేశ పౌరుల పరిస్థితేంటి అని కేజ్రీవాల్ కేంద్రాన్ని ప్రశ్నించారు. పాకిస్థానీయులను మన దేశంలో స్థిరపరచడానికి బిజెపి ప్రయత్నిస్తోందని దుయ్యబట్టారు. మనదేశ అభివృద్ధికి ఉపయోగించాల్సిన ప్రభుత్వ డబ్బును కేంద్రం పాకిస్థానీయుల స్థిరీకరణకు ఖర్చు చేయాల్సి వస్తుందని విమర్శించారు.




## బెంగళూరు బాంబు పేలుడు కేసులో కీలక వ్యక్తి అరెస్టు

**బెంగళూరు, మార్చి 13:** రామేశ్వరం కెఫే బాంబు పేలుడు కేసులో కీలక వ్యక్తిని జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఎ) అరెస్టు చేసింది. బుధవారం కర్ణాటకలోని బళ్లారి జిల్లాలో కస్టడీలోకి తీసుకున్నట్లు ఎన్ఐఎ అధికారి తెలిపారు. నిందితుణ్ని షబ్బీర్‌గా గుర్తించారు. ప్రస్తుతం రహస్య ప్రదేశంలో విచారిస్తున్నట్లు తెలిసింది. అయితే ఈ అరెస్టుపై ఎన్ఐఎ అధికారిక ప్రకటన చేయలేదు. ఈ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న వ్యక్తికి ఇతను సహరించినట్లు తెలిసింది. ఈ నెల ఒకటో తేదీన బెంగళూరులోని బ్రూక్‌ఫీల్డ్‌లో ఉన్న రామేశ్వరం కెఫేలో బాంబు పేలిన ఘటనలో 9 మంది గాయపడ్డారు. ఈ కేసులో కర్ణాటక హోంశాఖ ఎన్ఐఎకు అప్పగించింది. సిసటివి ఫుటేజీ ఆధారంగా నిందితుడి చిత్రాలను విడుదల చేశారు. అతడి ఆచూకీ చెప్పిన వారికి రూ.10లక్షల నగదు రివార్డును ఎన్ఐఎ ప్రకటించింది. ఈ కేసులో నిందితుడు ఆర్‌డిఎక్స్ ఉపయోగించాడని నిపుణులు గుర్తించారు. ఇప్పటికే ఈ కేసులో పలువురు అనుమానితులను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. ఈ క్రమంలోనే తొలి అరెస్టుచేశారు.

## ఇసిల నియామకాలపై 15న సుప్రీం అత్యవసర విచారణ



**ఢిల్లీ, మార్చి 13:** లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న వేళ సిఇసి, ఇసిల నియామకాల అంశం మరోసారి తెరపైకి వచ్చింది. ప్రధాన ఎన్నికల అధికారి, ఎన్నికల కమిషనర్ల నియామకాల కోసం కొత్తగా తీసుకొచ్చిన చట్టాన్ని సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో పిటిషన్లు దాఖలయ్యాయి. ఈ పిటిషన్ల అత్యవసర విచారణ చేపట్టాలని అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫామ్స్ (ఎడిఆర్) తాజాగా అభ్యర్థించింది. ఇందుకు అంగీకరించిన సర్వోన్నత న్యాయస్థానం, శుక్రవారం విచారణ జరుపుతామని వెల్లడించింది. కేంద్ర ఎన్నికల సంఘంలో ఖాళీ అయిన కమిషనర్ల పోస్టులను ఈ నెల 15వ తేదీలోగా భర్తీ చేసేందుకు కేంద్రం సిద్ధమవుతున్న వేళ, ఈ పరిణామం చోటు చేసుకోవడం ప్రాధాన్యం సంతరించుకుంది. గత నెల ఒక కమిషనర్ అనూప్ చంద్ర పాండే పదవీ విరమణ చేశారు. ఇటీవల మరో కమిషనర్ అరుణ్ గోయెల్ అనూహ్యంగా రాజీనామా చేశారు. దీంతో ప్రస్తుతం కేంద్ర ఎన్నికల సంఘంలో ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్ ఒక్కరే మిగిలారు. ఈ క్రమంలోనే ఖాళీ అయిన స్థానాలను భర్తీ చేసేందుకు కేంద్రం కసరత్తు మొదలుపెట్టింది.

ప్రధాని మోడీ, కాంగ్రెస్ లోక్‌సభాపక్ష నేత అధీర్ రంజన్ ఛౌదరి, కేంద్రమంత్రి సభ్యులుగా ఉన్న ఎంపిక కమిటీ మార్చి 15లోగా కొత్త కమిషనర్ల పేర్లను ఖరారు చేయనున్నట్లు వార్తలు వస్తున్నాయి. తాజా నియామకాలను సవాల్ చేస్తూ ఇటీవల కాంగ్రెస్‌కు చెందిన ఓ నేత సుప్రీం కోర్టులో పిటిషన్ వేశారు. దీన్ని కూడా శుక్రవారం విచారించే అవకాశాలున్నట్లు తెలుస్తోంది. ఎన్నికల కమిషనర్ల నియామకాలపై పార్లమెంటులో చట్టం చేసేవరకు ప్రధానమంత్రి నేతృత్వంలో లోక్‌సభలో విపక్ష నేత, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికసిలి సిఇసి, ఇసి నియామకాలు చేపట్టాలని 2023 మార్చిలో అత్యున్నత న్యాయస్థానం తీర్పునిచ్చింది. అయితే ప్రధాన ఎన్నికల కమిషనర్, ఎన్నికల కమిషనర్ల నియామకం, వారి సర్వీసు నిబంధనలకు సంబంధించి గతేడాది డిసెంబరులో కేంద్రం కొత్త చట్టం అమల్లోకి తెచ్చింది. దాని ప్రకారం, ఇసిల నియామక బాధ్యలను సెర్చ్, ఎంపిక కమిటీలు నిర్వహించనున్నాయి. ఎంపిక కమిటీలో సిజెఐ స్థానంలో ప్రధాని సూచించిన కేంద్రమంత్రిని చేర్చింది. దీన్ని సవాల్ చేస్తూనే సుప్రీంకోర్టులో పిటిషన్లు దాఖలయ్యాయి.

## అణు యుద్ధానికి సిద్ధం: పుతిన్



**మాస్కో, మార్చి 13:** అమెరికా సైన్యాన్ని పంపితే తీవ్ర పరిణామాలుంటాయని హెచ్చరించారు. యుద్ధం మరింత పెరుగుతుందని చెప్పారు. బుధవారం రష్యాలో ఓ టెలివిజన్ ఛానల్‌కు పుతిన్ ఇంటర్వ్యూ ఇచ్చారు. ఈ సందర్భంగా రష్యా అణు యుద్ధానికి సిద్ధంగా ఉందా అని అడిగిన ప్రశ్నకు బదులిస్తూ, అణుయుద్ధానికి పూర్తి సన్నద్ధతతో ఉన్నామని, కానీ ఆ ప్రయోగానికి ఇప్పుడు తొందరేం లేదన్నారు. రష్యా సార్వభౌమాధికారాన్ని దెబ్బ తీయాలని చూస్తే మాత్రం కచ్చితంగా వాటిని ప్రయోగిస్తామని వార్నింగ్ ఇచ్చారు. ఉక్రెయిన్‌లో యుఎస్ దళాలను మోహరిస్తే ఏం జరుగుతుందో అమెరికాకు ఇప్పటికే అర్థమైందని తెలిపారు. అణు యుద్ధం చేయడంలో ఇబ్బందేం లేదని, అయితే ఉక్రెయిన్‌లో వాటిని ఉపయోగించాల్సిన అవసరం ఏమీ లేదని స్పష్టం చేశారు. రష్యా ప్రజలు తనకు మరో ఆరేళ్ల అధికారం ఇవ్వడం ఖాయమని దీమా వ్యక్తం చేశారు. 'రష్యా-అమెరికా సంబంధాలలో అనేకమంది నిపుణులు ఉన్నారు. కాబట్టి అణు ఘర్షణ పరిస్థితులు తలెత్తుతాయని భావించట్లేదు. కానీ అనుకోని పరిస్థితులు ఎదురైతే మాత్రం వెనుకడుగు వేయబోము'అని పుతిన్‌తెలిపారు. ఉక్రె యిన్‌లో పోరాడటానికి దళాలను పంపితే పశ్చిమ దేశాలు అణు యుద్ధాన్ని రెచ్చగొట్టే ప్రమాదం ఉందని పుతిన్ గతంలోనూ హెచ్చరించారు. దేశ అంతర్గత వ్యవహారాల్లో జోక్యం చేసుకోవడానికి తమ ప్రభుత్వం ఎవరినీ అనుమతించదన్నారు.

## విశ్వాసపరీక్షలో నెగ్గిన నేపాల్‌ప్రధాని పుష్పకమల్

**ఖాట్మండు, మార్చి 13:** నేపాల్‌ప్రధాన మంత్రి పుష్పకమల్‌ధహల్ పార్లమెంటులో నిర్వహించిన విశ్వాసపరీక్షలో విజయం సాధించారు. మూడోసారి సంకీర్ణ ప్రభుత్వం ఏర్పాటుచేసిన వారం రోజుల తర్వాత పార్లమెంటులో నిర్వహించిన విశ్వాసపరీక్షలు ఆయన నెగ్గారు. లిబరల్ కమ్యూనిస్టుల ఆధిపత్యంతో మరోసారి ధమాల్‌ప్రభుత్వం కొనసాగిస్తున్నారు. మాజీ మావోయిస్టు గెరిల్లా నాయకుడు అయిన దహల్ చైనా, భారత్‌లమధ్య ఉన్న హిమాలయ దేశంలో ప్రముఖంగా పేరుపొందారు. నేపాలి కాంగ్రెస్ పార్టీ మరికొన్ని చిన్న పార్టీలతోకలిసి ఆయన గత ఏడాది సంకీర్ణ ప్రభుత్వం ఏర్పాటుచేసారు. అయితే కూటమిలో తనకు స్వేచ్ఛ ఇవ్వడంలేదని ఆయన మిత్రపక్షాలను కూడా మార్చేసారు. కొత్తకేబినెట్‌లో లిబరల్ నేపాల్ కమ్యూనిస్టు పార్టీతోపాటు మరికొన్ని చిన్నగ్రూప్‌లు వచ్చాయి. 2022 ఎన్నికల తర్వాత యుఎంఎల్‌పార్టీతో కలిసి సంకీర్ణప్రభుత్వం కూడా దహల్ నడిపారు. 275మంది సభ్యులున్న పార్లమెంటులో 110 మంది దహల్‌కు వ్యతిరేకంగా ఓటువేసారు. 157 మంది దహల్‌కు మద్దతుపలికారు. మెజార్టీ 138 మార్కుకంటే దహల్‌కు ఎక్కువ ఓట్లు రావడంతో స్పీకర్ దేవ్‌రాజ్ ఘిమిరే పుష్పకమాల్ దహల్ నెగ్గినట్లు ప్రకటించారు. 2006లో జరిగిన శాంతి ఒప్పందానికి ముందు 1996 నుంచి కూడా దహల్ నేపాల్‌లో కల్లోలానికి కారకుడని మావోయిస్టు గెరిల్లా నేతగా పేరుపడ్డారు. ఈ కల్లోలంలోనే 17వేలమందికి పైగా మరణించారు. ఆ తర్వాత ఐక్యరాజ్య సమితి శాంతి ఒప్పందం చేసిన తర్వాత జనజీవన స్రవంతిలోకి దహల్ వచ్చారు. వరుసగా మూడోసారి ఆయన ప్రధానిగా వచ్చారు.

అయితే ఎప్పుడూ కూడా ఆయన ఐదేళ్ల పూర్తికాలం కొనసాగలేదు. 2008లో నేపాల్ రాజరికవ్యవస్థ రద్దయిన తర్వాత ఇప్పటివరకూ 13 ప్రభుత్వాలు ఏర్పాడ్డాయి. 40 బిలియన్ డాలర్ల ఆర్థికవ్యవస్థ ఉన్న నేపాల్‌లో ఆర్థిక అస్థిరత కారణంగా అనేకమంది నేపాల్ యువత మధ్యప్రాచ్యం, దక్షిణకొరియా, మలేసియా దేశాలకు వలసపోతున్నారు.

## ఉత్తరాఖండ్ ఉమ్మడి పౌరస్మృతి బిల్లుకు రాష్ట్రపతి ఆమోదం!




**న్యూఢిల్లీ,మార్చి 13:** ఉత్తరాఖండ్ అసెంబ్లీలో ఫిబ్రవరి7న ఆమోదించి ఉమ్మడి పౌరస్మృతి బిల్లుకు రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము బుధవారం ఆమోద ముద్ర వేశారు.దీంతో ఈ బిల్లు చట్టంగా మారింది. మతంతో సంబంధం లేకుండా వివాహాలు, విడాకులు, భూములు,ఆస్తులు, వారసత్వ చట్టాలు అందరికీ ఒకే రీతిలో వర్తించేందుకు ఉద్దేశించిన ఈ బిల్లును ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామి గత అసెంబ్లీ సమావేశాల్లో ప్రవేశపెట్టగా, బిల్లు సభామోదం పొందింది. వివాహాలు, విడాకులు, వారసత్వం, లివ్-ఇన్ రిలేషన్ షిప్, సంబంధిత అంశాలకు ఉద్దేశించి ఈ చట్టం రూపొందింది. యూసీసీ ప్రకారం సహజీవనం సాగించడాన్ని కూడా రిజిస్టర్ చేయించుకోవాలి. బాల్యవివాహాలపై సంపూర్ణ నిషేధం ఉంటుంది. విడాకులకు సంబంధించి యూనిఫాం విధానం అమల్లోకి వస్తుంది. అన్నిమతాల్లోని మహిళలకు ఆస్తిలో సమాన హక్కులను ఈ చట్టం కల్పిస్తుంది. యూసిసీ చట్టం ప్రకారం యువతుల వివాహాల రిజిస్ట్రేషన్ అన్నిమతాల వారికి తప్పనిసరి. రిజిస్ట్రేషన్ జరగకుంటే ఆ వివాహం చెల్లదు. ఏడాది తర్వాత మాత్రమే పిటిషన్లను అనుమతిస్తారు.

## ఢిల్లీ హైకోర్టులో కాంగ్రెస్‌కు షాక్

### ఐటినోటీస్‌పై స్టేకు నిరాకరణ

**న్యూఢిల్లీ, మార్చి 13:** కాంగ్రెస్ పార్టీ పన్ను బకాయిలు 100 కోట్లు వసూలుచేసేందుకు ఆదాయపు పన్నుశాఖ జారీచేసిన నోటీస్‌పై స్టే ఇచ్చేందుకు ఢిల్లీ హైకోర్టు నిరాకరించింది. జస్టిస్ యశ్వంత్‌వర్మ, పురుషేంద్రకుమార్ కౌరవ్‌లతో కూడిన బెంచ్ ఆదాయపు పన్ను అప్పిలేట్ ట్రిబ్యునల్ ఉత్త ర్వుల్లో జోక్యంచేసుకునేందుకు ఎలాంటి కారణం కనిపించడంలేదని చెప్పింది. కాంగ్రెస్ పార్టీ ఐటాట్ ఉత్తర్వులపై ఢిల్లీ హైకోర్టును ఆశ్రయిం చిన సంగతి తెలిసిందే. గతనెల 13వ తేదీ ఐటిశాఖ ఇచ్చిన నోటీసుపై స్టే మంజూరుచేయా లనికోరింది. ఐటిఅసెస్‌మెంట్ అధికారి రూ.100కోట్ల ట్యాక్స్ డిమాండ్ నోటీస్ ఇచ్చారు. కాంగ్రెస్ పార్టీ తరపున వాదించిన కౌన్సెల్ తనవాదనల్లో పార్టీకి ఈసమయంలో ఇలాంటి ఉత్తర్వులు కొంత నష్టంచేస్తాయని,అందువల్ల తాత్కాలిక స్టేమంజూరు చేయాలని కోరారు. ఐటిశాఖ కౌన్సెల్ తన వాదనల్లో వాస్తవ డిమాండ్ 102 కోట్లుగా ఉందని, వడ్డీతో కలిపితే 135.06 కోట్లు వరకూ ఉందని, ఇప్పటివరకూ 65.94 కోట్లు రికవరీ అయిందని తెలిపారు. ఈపరిస్థితుల్లో ఐటిశాఖ జారీచేసిన నోటీసులపై జోక్యం అవసరమని భావించడం లేదని న్యాయమూర్తులు పేర్కొన్నారు.

## హిందూ మహా సముద్రంలో నౌక హైజాక్..

**ఢాకా, మార్చి 13:** హిందూ మహాసముద్రంలో సముద్రపు దొంగలు మళ్లీ రెచ్చిపోయారు. బంగ్లాదేశ్ జెండాతో ఉన్న ఓ కార్గో నౌకను హైజాక్ చేశారు. మంగళవారం మధ్యాహ్నం ఈ ఘటన జరిగినట్లు నౌక యాజమాన్యం బుధవారం వెల్లడించింది. బంగ్లాదేశ్‌లోని కబీర్ స్టీల్ అండ్ రీరోలింగ్ మిల్ గ్రూప్‌నకు చెందిన 'అబ్దుల్లా' అనే కార్గో నౌక మొజాంబిక్ దేశం నుంచి బొగ్గు తీసుకుని యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌కు బయల్దేరింది. ఈ నౌక మంగళవారం హిందూ మహా సముద్రంలో ప్రయాణిస్తుండగా సముద్రపు దొంగలు అందులోకి చొరబడ్డారు. ఆయుధాలతో సిబ్బందిని బెదిరించి నౌకను తమ నియంత్రణలోకి తీసుకున్నారు.అందులో 23 మంది సిబ్బంది ఉన్నారని, వారిని సంప్రదించేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలిసింది. దుండగులు నౌకను తమ అధీనంలోకి తీసుకున్నారని, అయితే సిబ్బంది మాత్రం సురక్షితంగానే ఉన్నారని పేర్కొంది. ప్రస్తుతం దాన్ని సోమాలియా తీరం దిశగా తీసుకెళ్తున్నట్లు తమకు సమాచారం అందిందని వెల్లడించింది. బంగ్లాదేశ్ చరిత్రలో తమ ఓడలు హైజాక్‌కు గురవడం ఇది రెండోసారి. 2010లో ఇలాగే ఓ నౌకను అరేబియా సముద్రంలో సముద్రపు దొంగలు అడ్డగించి తమ అధీనంలోకి తీసుకున్నారు. అందులోకి 25 మంది సిబ్బందిని బందీలుగా చేసుకుని దాదాపు 100 రోజుల తర్వాత విడిచిపెట్టారు. తాజా ఘటన ఎవరు చేశారన్నది ఇంకా తెలియరాలేదు.

## కెనడాలో మళ్లీ రెచ్చిపోయిన ఖలిస్థానీ మద్దతుదారులు

### నిజ్జర్ హత్యలో భారత్ పాత్ర ఉందని ఆరోపణలు

**ఒట్టావా, మార్చి 13:** కెనడాలో మళ్లీ ఖలిస్థానీ మద్దతుదారులు రెచ్చిపోతున్నారు. భారత్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ అక్కడ ఆందోళనలు, నిరసనలు వ్యక్తం చేస్తున్నారు. ఇక గతేడాది కెనడాలో హత్యకు గురైన ఖలిస్థానీ ఉగ్రవాది హర్దీప్‌సింగ్ నిజ్జర్ విషయంలో భారత్‌పై ఆరోపణలు రావడం, ఖలిస్థానీ మద్దతుదారుల నిరసనలు మరింత పెరిగాయి. హర్దీప్ సింగ్ నిజ్జర్ హత్యలో భారత్ ఏజెంట్ల పాత్ర ఉందని కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో చేసిన వివాదాస్పదవ్యాఖ్యలు, రెండు దేశాల మధ్య ఉన్న సత్సంబంధాలను దెబ్బతీశాయి. అప్పటి నుంచి ఖలిస్థాన్ మద్దతుదారులు భారత్‌పట్ల, భారత రాజకీయ నేతలు లక్ష్యంగా తీవ్ర బెదిరింపులకు దిగిన ఘటనలు ఉన్నాయి. కెనడా అల్బెర్టాలోని ఎడ్మోంటన్ ప్రాంతంలో భారీగా ఖలిస్థానీ మద్దతుదారులు చేరుకుని తీవ్ర నిరసనలు వ్యక్తం చేశారు. కత్తులు, ఈటెలు, ఇతర మారణాయుధాలు తీసుకువచ్చి తీవ్ర కలకలం రేపారు. ఈ క్రమంలోనే ఖలిస్తానీ మద్దతుదారులను అడ్డుకునేందుకు, వారిని చెదరగొట్టేందుకు ఎడ్మోంటన్ పోలీసులు తీవ్రంగా ప్రయత్నించారు. ఇక భారత హైకమిషనర్ సంజయ్ కుమార్ వర్మ వాహనం వైపు దూసుకెళ్లేందుకు ప్రయత్నించిన ఖలిస్తానీ మద్దతుదారులను పోలీసులు అడ్డుకున్నారు. దీంతో అక్కడ తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. హర్దీప్‌సింగ్ నిజ్జర్ హత్య వెనుక భారత ఏజెంట్ల హస్తం ఉందని కెనడా ప్రధాని చేసిన ఆరోపణలను భారత్ తీవ్రంగా ఖండించింది. అవన్నీ అబద్ధాలని ఇప్పటికే చాలాసార్లు స్పష్టం చేసింది. ఖలిస్తాన్ ఉగ్రవాది అయిన హర్దీప్‌సింగ్ నిజ్జర్‌ను కెనడాలోని ఓ గురుద్వారా వద్ద గత యేడాది జూన్ 18న గుర్తుతెలియని వ్యక్తులు కాల్చి చంపారు. హర్దీప్‌సింగ్ నిజ్జర్‌ను భారత్ మోస్ట్ వాంటెడ్ ఉగ్రవాదిగా అంతకుముందు ప్రకటించింది.

## అరుణాచల్ 60 స్థానాలకు బిజెపి అభ్యర్థులు వెల్లడి

**ఇటానగర్, మార్చి 13:** లోక్‌సభ ఎన్నికలతోపాటే అసెంబ్లీకి సైతం ఎన్నికలు జరగనున్న అరుణాచల్‌ప్రదేశ్‌లో బిజెపిహైకమాండ్ మొత్తం 60స్థానాలకు అభ్యర్థులనుప్రకటించింది. ముఖ్యమంత్రి పెమాఖండూ ముక్తోస్థానంనుంచి పోటీచేస్తున్నట్లుప్రకటించారు. అరుణాచల్ బిజెపి చీఫ్ బియూరామ్ వాఘే కూడా పక్కేకెస్సంగ్ ఎస్టీ స్థానంనుంచి పోటీచేస్తుంటే డిప్యూటి సిఎం చౌనా మైయిన్ చౌకన్‌ఎస్టీస్థానంనుంచి పోటీచేస్తున్నారు. కొత్తగావచ్చిన రాటు టెచ్చి సగాలీ స్థానం నుంచి పోటీచేస్తారు. ప్రస్తుతం ఈస్థానంనుంచి మాజీ సిఎం నబామ్ టుకి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఇటీవల నిర్వహించిన కేంద్ర ఎన్నికల కమిటీ సమావేశంలో రాష్ట్రంలోని మొత్తం 60 స్థానాల అభ్యర్థులను ఆమోదించింది. పట్టణాభివృద్ధిమంత్రి కమ్లున్ మోస్సాంగ్ ఎస్టీ మియవో స్థానంనుంచి గ్రామీణ పనులు, సైన్స్ టెక్నాలజీ మంత్రి హోంచున్ ఎంగందంను ఎస్టీస్థానం పోంగ్చావో వాక్కాస్థానం, పబ్లిక్ హెల్త్ ఇంజనీరింగ్; సాగునీటిసరఫరా మంత్రి వాంగకీ లతోవాంగ్‌ను ఎస్టీస్థానం నామ్‌సాంగ్ నుంచి పోటీకి ఎంపికచేసారు.

## నైవేద్యం పాత్రలు విరాళం

శ్రీకాళహస్తి,మార్చి 13 ప్రభాతవార్త



శ్రీకాళహస్తీశ్వరాలయానికి సంబంధించిన స్వామి అమ్మవార్లకు నైవేద్యం తయారు చేయటానికి సంబంధించిన పాత్రలను బుధవారం అందించారు. శ్రీకాళహస్తికి చెందిన రాజాసాయికిషోర్ వారి కుటుంబ సభ్యులు స్వామి అమ్మవార్లకు విరాళం అందించుటకు నిర్ణయించారు. ఈమేరకు రాజాసాయి కిషోర్ సుమారు 17కేజిల వంట పాత్రలు విరాళంగా అందించారు. వీటిని ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు ద్వారా అందజేసారు. వారికి ప్రత్యేక ఆశీర్వచనాలు అందించారు. వారికి వేదపండితులచే ప్రత్యేకాశీర్వచనాలు అందించారు. ఈ కార్యక్రమాల్లో పాలకమండలి సభ్యులు కొండుగారి కృష్ణమూర్తి, సుబ్బరామగుప్తా, ఆవుల పాటు శ్రీనివాసులు, పెద్దిరెడ్డి మల్లికార్జునరెడ్డి, ప్రత్యేకాహ్వానితులు జూలుగంటి సుబ్బారావు, కంఠాఉదయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## సిపాయి భరోసా

శ్రీకాళహస్తి రూరల్ మార్చి 13 ప్రభాతవార్త

మండలంలోని వేడాం పంచాయితీలోని వేడాం పెద్దమిట్టకండ్రిగ గ్రామానికి చెందిన గోపాల్ కటుంబానికి బుధవారం రక్షధినేత, ఎమ్మెల్సీ డాక్టర్. సిపాయి సుబ్రమణ్యం సిపాయి భరోస కింద 42 రకాల నిత్యావసర సరుకులను అందజేశారు. ఇటీవల అనారోగ్యంతో బాధపడుతూ గోపాల్ మృతి చెందారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల కుటుంబంలో పెద్దదిక్కు కొల్పోయిన వారికి అండగా ఉండేందుకు సిపాయి భరోస అందజేయడం జరుగుతుందన్నారు. జగనన్న సంక్షేమ పథకాలతో ప్రజలు సంతోషంగా ఉన్నారని, మళ్ళీ జగన్‌ను ముఖ్యమంత్రి చేయాలన్నారు. శ్రీకాళహస్తి నియోజక వర్గ శాసనభ్యుడు మధుసూదర్‌రెడ్డి పరిపాలనలో ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. ఏ కుటుంబంలో అయిన పెద్దదిక్కు కొల్పోతే వారి కుటుంబానికి అండగా ఉంటరన్నారు. ఈ కార్యకమంలో రత్నంరెడ్డి, బాలాజిప్రసాద్‌రెడ్డి, పెరుమాళ్‌రెడ్డి, కిట్టు(మేస్త్రి), శివ తదితరులు పాల్గొన్నారు.

రైటప్ సిపాయి భరోసను అందజేస్తున్న సిపాయి.

## తెదేపా జిల్లా సోషల్‌మీడియా కన్వీనర్‌గా చంద్రశేఖర్

శ్రీకాళహస్తి, మార్చి 13 ప్రభాతవార్త



భారతీయ సమాజంలో సంస్కృతి, సంప్రదాయాల పరంగా విశిష్ట స్థానం కలిగిన నాయిబ్రాహ్మణ కుటుంబాలను అభివృద్ధిలోకి తీసుకురావడానికి అవసరమైన కొన్ని చర్యలు తీసుకుంటామని తెలుగుదేశంపార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి బొజ్జలవెంకటసుధీర్‌రెడ్డి పేర్కొన్నారు. నాయిబ్రాహ్మణులు ఎదుర్కొంటున్న అనేక సమస్యల పరిష్కారం కోసం అవిశ్రాంతంగా కృషి చేస్తున్న పట్టణానికి చెందిన తెలుగుదేశంపార్టీ సీనియర్ కార్యకర్త కోట చంద్రశేఖర్‌ను నాయిబ్రాహ్మణ సాధికార సమితి తిరుపతి జిల్లా సోషల్ మీడియా కన్వీనర్‌గా నియమిస్తూ జారీ చేసిన ఉత్తర్వులను సుధీర్‌రెడ్డి అందించి అభినందించారు. వాయిద్య కళాకారులుగా, తలనీలాలు తీసి, క్షవర వృత్తిదారులుగా రాష్ట్ర దేవాదాయధర్మాదాయ శాఖ పరిధిలోని అన్నిదేవాలయాల్లో పనిచేస్తున్న నాయిబ్రాహ్మణులకు చట్టపరమైన ఉద్యోగ భద్రత కల్పించడానికి కృషి చేస్తామని సుధీర్‌రెడ్డి హామీ ఇచ్చారు. నాయిబ్రాహ్మణులు నిర్వహించుకునే క్షవరశాలలకు 200యూనిట్ల విద్యుత్‌ను ఉచితంగా అందించేలా చర్యలుతీసుకుంటామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ జి.దశరధాచారి, బిసి విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ యం. ఉమేష్‌రావు, మిన్నల్‌రవి, నెమ్మళ్ళూరు బుజ్జి, సురేంద్రయాదవ్, బీమాలభాస్కర్, చిల్లకూరుమణి, సతీష్, మునిరాజయాదవ్, నాయిబ్రాహ్మణ సంక్షేమ సంఘం నాయకులు కృష్ణమూర్తి, రమేష్, శ్రీను, నరసింహులు, మహేష్, శంకర్, మైనార్టీ నాయకులు షేక్ రియాజ్, షేక్ జిలానీ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేయండి

-ఎంపిడిఓ ఐజాక్ ప్రవీణ్

తొట్టంబేడు, మార్చి 13 ప్రభాతవార్త



ప్రభుత్వ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికి చేరవేయడమే సచివాలయ సిబ్బంది బాధ్యత అని ఎంపిడిఓ ఐజాక్ ప్రవీణ్ అన్నారు. బుధవారం మండలంలోని బసవయ్యపాళెం గ్రామ సచివాలయాన్ని సందర్శించారు. సచివాలయ సిబ్బంది బయోమెట్రిక్ హాజరును పరిశీలించి ఉద్యోగి ఎవరైనా సెలవు పెట్టినట్లయితే ముందుగా డిడిఓగా ఉన్న పంచాయతీ కార్యదర్శి అనుమతి తప్పనిసరిగా తీసుకుని వారి శాఖకు సంబంధించిన మండల స్థాయి అధికారి వద్ద అనుమతి తీసుకోవాలన్నారు. సచివాలయం ద్వారా ప్రజలకు అందుతున్న సర్వీసుల గురించి ఆరాతీ శారు. ఎంపిడిఓతో పాటు ఈవోపిఆర్డీ తరుణాక్షరెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## తిరుచానూరులో కేంద్ర బలగాలతో కవాతు

తిరుచానూరు, మార్చి 13, ప్రభాతవార్త



తిరుచానూరు గ్రామంలో కేంద్ర బలగాలతో ఆ గ్రామ సిఐ ఆధ్వర్యంలో ప్రధాన మార్గాలలో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా రానున్న రాష్ట్ర ఎన్నికల నేపథ్యంలో గ్రామ ప్రజలకు భద్రతలో భరోసా కల్పిస్తామని, గ్రామ ప్రజలు స్వేచ్ఛగా తన ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. ఓటర్లు తమను ఎవరైనా నాయకులు గాని కార్యకర్తలు గాని పార్టీ సానుభూతి పరులు బెదిరింపులకు పాల్పడితే వెంటనే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. బెదిరింపులకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు చేపడుతామని అన్నారు. రానున్న రాష్ట్ర ఎన్నికలకు ఓటు వేయడం రాజ్యాంగ హక్కు అని, ఓటరు కార్డు కలిగిన ప్రతి ఒక్కరు స్వేచ్ఛగా హక్కులని వినియోగించుకోవాలని అన్నారు.

## విజయశ్రీని ఆశీర్వదించండి

సూళ్లూరుపేట, మార్చి 13 ప్రభాతవార్త



సూళ్లూరుపేట తెలుగుదేశం పార్టీ శాసనసభ అభ్యర్థిగా పోటీ చేస్తున్న నెలవల విజయశ్రీని ఆశీర్వదించి గెలిపించాలని మాజీ ఎంపీ, నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జ్ నెలవల సుబ్రహ్మణ్యం కోరారు. బుధవారం సూళ్లూరుపేట పట్టణ పరిధిలోని కస్వారెడ్డిపాలెంలో నిర్వహించిన నెలవల విజయశ్రీ పరిచయ వేదికలో ఆయన మాట్లాడుతూ చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి కావాలంటే సూళ్లూరుపేట నుంచి విజయశ్రీని గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ప్రతి కార్యకర్త సైనికుల్లాగా పనిచేసి పార్టీ విజయానికి కృషి చేయాలన్నారు. రాష్ట్ర ప్రజల భవిష్యత్ బాగుండాలంటే చంద్రబాబునాయుడిని తిరిగి ముఖ్యమంత్రి చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అనంతరం ఆయన నెలవల విజయశ్రీని పార్టీ కార్యకర్తలకు, నేతలకు పరిచయం చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు ఆకుతోట రమేష్, చిట్టేటి పెరుమాళ్ళు, అలవల శ్రీనివాసరావు, మేడా సాయినారాయణ, ఎజి కిషోర్, కె.శ్రీధర్, బొమ్మన్ శ్రీధర్, పెంచలయ్య, వెంకటేశ్వర్లు, బండారు ఆంజనేయులు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## చంద్రబాబుకు లక్ష మెజార్టీయే లక్ష్యం

- ఎమ్మెల్సీ డా।। కంచర్ల శ్రీకాంత్

శాంతిపురం, మార్చి 13 ప్రభాతవార్త



కుప్పంలో ఈసారి తెదేపా అధినేత చంద్రబాబు నాయుడుకు లక్ష ఓట్ల మెజార్టీ సాధనే లక్ష్యమని ఎమ్మెల్సీ డా।। కంచర్ల శ్రీకాంత్ పేర్కొన్నారు. బుధ వారం మండలంలోని కాకర్లవ ఒక, బిఎం గొల్లపల్లి గ్రామాల్లో ఆయన పార్టీ పతాకావిష్కరణలు చేసి ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమంలో పాల్గొన్నారు. వెనుకబడిన కుప్పాన్ని చంద్రబాబు అభివృద్ధి చేసిన విషయం ప్రజలకు తెలుసన్నారుమాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, రాష్ట్ర నేత డా।। బిఆర్ సురేష్‌బాబు, నేతలు విశ్వనాథనాయుడు, జనార్ధనరెడ్డి, ఉదయ్, మణి, నాగరాజు, రమేష్, మునేగౌడు, శివ, బాలు, పుష్ప, శకుంతల, అనసూయ, చంద్రకళ, సుగుణమ్మ, శ్యామలమ్మ, పొలారాణి, రూప, హేమ పాల్గొన్నారు.

## తెదేపాతోనే మహిళాభివృద్ధి సాధ్యం

- తెదేపా ఇన్‌ఛార్జ్ పిఎస్ మునిరత్నం

రామకుప్పం, మార్చి 13 ప్రభాతవార్త

తెదేపాతోనే మహిళాభివృద్ధి సాధ్యమని కుప్పం తెదేపా ఇన్‌ఛార్జ్ పిఎస్ మునిరత్నం, చంద్రబాబు కార్యదర్శి మనోహర్ పేర్కొన్నారు. స్థానిక ఓ కళ్యాణ మండపంలో బుధవారం మహిళాసాధికార సారధుల శిక్షణ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ వైకాపా పాలనలో మహిళలకు ఎలాంటి భరోసా లభించలేదన్నారు. మహిళలకు అండగా నిలవాలనే తెదేపా అధినేత చంద్రబాబునాయుడు మహాలక్ష్మి పథకాన్ని ప్రవేశపెట్టారన్నారు. మహిళలు చంద్రబాబుకు అండగా నిలవాలని కోరారు. నేతలు మునస్వామి, ఆనందరెడ్డి, ఆంజనేయరెడ్డి, నరసింహులు, చలపతి, నందారెడ్డి, రఫీ, పద్మమ్మ, అలివేలుమంగమ్మ, రాణెమ్మ పాల్గొన్నారు.

## సత్యవేడు అభ్యర్థిగా నా అభ్యర్థిత్వాన్ని ప్రమోట్ చేస్తే..

అందరికీ అందుబాటులో ఉంటా

టిడిపి రాష్ట్ర అధ్యక్షుడుతో రాష్ట్ర ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు దశరధ వాసు

తిరుపతి హెల్త్, మార్చి 13, ప్రభాతవార్త



సత్యవేడు టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థిగా నా అభ్యర్థిత్వాన్ని ప్రమోట్ చేస్తే స్థానికుడిని కాబట్టి అందరికీ అందుబాటులో ఉండి మీకు ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటానని టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు అచ్చమనాయుడుతో ఆ పార్టీ రాష్ట్ర ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు దశరథ వాసు వివరించారు. అమరావతిలో బుధవారం పార్టీ అధ్యక్షుడు అచ్చమనాయుడుతో, రాయలసీమ జోన్ ఇన్చార్జి ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డిలను కలిసి తన అభ్యర్థితో పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా వారితో మాట్లాడుతూ 2014, 2019 ఎన్నికల్లోను అభ్యర్థిత్వం కోసం దరఖాస్తు చేసుకుని ప్రయత్నించానని, పార్టీ నిర్ణయం మేరకు బీఫామ్ ఇచ్చిన వారికి నా శాయశక్తుల గెలుపు కోసం శ్రమించానన్నారు. అలాగే నింద్ర మండల పార్టీ అధ్యక్షుడిగా మూడుసార్లు సేవలందిస్తూ నగరిలో గాలి ముద్దు కృష్ణం నాయుడు గెలుపు కోసం, తర్వాత గాలి భానుప్రకాష్ గెలుపు కోసం కీలక భూమిక పోషించానని గుర్తు చేశారు. సత్యవేడు నియోజకవర్గంలో నా సామాజిక వర్గానికి చెందిన తమిళ మాలలు అధిక సంఖ్యలో ఉండడంతో పాటు ఏడు మండలాల్లోనూ బంధుగణం, మిత్రులు, మా పూర్వ విద్యార్థులు పుష్కలంగా ఉండడంతో నా గెలుపు అవకాశాలు నల్లేరు మీద నడకేనని ఆశాభావం వ్యక్తపరిచారు. ఈయన విన్నపాన్ని సావధానంగా విన్నవారు సానుకూలంగా స్పందిస్తూ అధిష్టానం దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చినట్లు వివరించారు.

## ప్రజా సంక్షేమమే జగనన్న లక్ష్యం..!

వైసిపి యువజన నాయకుడు చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి

చంద్రగిరి, మార్చి 13 ప్రభాతవార్త:



ప్రజా సంక్షేమమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి లక్ష్యమని వైసిపి యువజన నాయకుడు చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి అన్నారు. మండల పరిధిలోని శానంబట్ల, పిచ్చినాయుడు పల్లి, రాయలపురం, గంగుడుపల్లి, తొండవాడ గ్రామ పంచాయతీలలో ఎంఎల్‌ఏ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి తుడా నిధులతో నిర్మించిన సిసి రోడ్లు, రైతు భరోసా భవనాలు, వైఎస్‌ఆర్ సమావేశ మందిరాలు, ద్యానమందిరాలు, తారు రోడ్లు, గ్రావెల్ రోడ్లను, గ్రామ వేధికలను బుధవారం పండుగ వాతావరణంలో ఎంపిపి మావిళిరెడ్డిగారి హేమేంద్రకుమార్ రెడ్డితో కలసి ఆయన ప్రారంభించారు. మీ అందరి ఆదరాభిమానాలతో ఎంఎల్‌ఏగా ఆయన చేసిన సేవలను గుర్తించి 2024 సాధారణ ఎన్నికలలో తుడా చైర్మన్, ఎంఎల్‌ఏ అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్ రెడ్డిని ఆశీర్వదించాలని కోరారు.

## ప్రతి విద్యార్ధి సాంకేతికతను పెంపొందించుకోవాలి..!

ఎంఈఓ శ్రీవరం లితకుమారి

చంద్రగిరి, మార్చి 13 ప్రభాతవార్త:



ప్రతి విద్యార్ధి సాంకేతికతను పెంపొదించుకోవాలని ఎంఈఓ శ్రీవరం లలితకుమారి అన్నారు. స్థానిక ఆర్‌ఎఫ్ రోడ్డులోని బ్లూమింగ్ బడ్స్ హై స్కూల్లో బుధవారం సైన్స్ డే సందర్భంగా సైన్స్ ఎక్స్‌పో-2024 ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా విచ్చేసిన ఆమె మాట్లాడుతూ భారతీయ శాస్త్రవేత్త సర్ సి.వి.రామన్ ప్రతిభకు పురస్కారమే జాతీయ విజ్ఞాన దినోత్సవం (సైన్స్ డే) అన్నారు. సర్.సి.వి.రామన్ సేవలను గుర్తించిన భారత ప్రభుత్వం ఫిబ్రవరి 28రోజును జాతీయ విజ్ఞాన శాస్త్ర దినోత్సవం రోజుగా ప్రభుత్వం ప్రకటించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్కూల్ చైర్మన్ బి.హితేంద్రనాధ్ రెడ్డి, పాఠశాల హెచ్‌ఎం, టీచర్లు, విద్యార్థులు, పేరెంట్స్ పాల్గొన్నారు.

## అభివృద్ధికి పట్టం కట్టండి..!

వైసిపి యువజన నాయకుడు చెవిరెడ్డి జ్ఞానేష్ రెడ్డి

రామచంద్రాపురం, మార్చి 13 ప్రభాతవార్త:



అభివృద్ధికి మరోసారి పట్టం కట్టాలని వైసిపి యువజన నాయకుడు చెవిరెడ్డి జ్ఞానేష్ రెడ్డి అన్నారు. బుధవారం మిట్టకండ్రిగ, కుప్పం బాదూరు, సి.కె.పల్లి, నెత్తకుప్పం, సచివాలయాల పరిధిలో పలు అభివృద్ధి పనులను ఎంపిపి ఏవి బ్రహ్మానంద రెడ్డితో కలసి ప్రారంభించారు. త్వరలో జరిగే సాధారణ ఎన్నికలలో తుడా చైర్మన్, ఎంఎల్‌ఏ అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్ రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జడ్పీటిసి ఢిల్లీరాణి భానుకుమార్ రెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు చంద్రశేఖర్ రెడ్డి, వైస్ ఎంపిపి లావణ్య చంద్రబాబు, డివిజినల్ కన్వీనర్ వెంకటరెడ్డి, పంచాయతీ కన్వీనర్లు సాయి శశికాంత్, శిరిపిరెడ్డి కేశవులు రెడ్డి, నాయకులు యశ్వంత్ రెడ్డి, బీకిరెడ్డి, మోహన్ రావు, తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధిలో ఆదర్శం....సంక్షేమంలో సమృద్ధి

-నిరంతర ప్రజాసేవలో ఉంటూ...ప్రజాసేవే దైవంగా సేవలు

-మీ కోసం...మీ మోహిత్ కార్యక్రమంలో చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

తిరుపతిరూరల్, మార్చి 13 ప్రభాతవార్త:



చంద్రగిరి ఎమ్మెల్యేగా తనను గెలిపిస్తే...చంద్రగిరి నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దటంతో పాటు సంక్షేమంలో సమృద్ధికి కృషి చేస్తానని తుడ చైర్మెన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి తెలిపారు. బుధవారం తిరుపతి రూరల్ మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాలను పండగ వాతావరణంలో ప్రారంభోత్సవం చేసారు. బ్రాహ్మణపట్టు, పాడిపేట, ముండ్లపూడి, తిరుచానూరు, పద్మావతీపురం, శ్రీనివాసపురం, సాయినగర్, ఓటేరు, కుంత్రపాకం, తనపల్లి, వేదాంతపురం, చిగురువాడ, కే.సి.పేట, దుర్గసముద్రం, అవిలాల పంచాయతీలలో పలు అభివృద్ధి పనులను తుడ చైర్మెన్ చంద్రగిరి వైకాపా ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి ప్రారంభించారు. పద్మావతిపురంలో రూ.26లక్షలతో నిర్మించిన వైయస్సార్ ఆరోగ్యశ్రీ కేంద్రాన్ని ప్రాంభించారు. ముండ్లపూడిలో రూ.30లక్షల సిసి రోడ్డుకు శంఖుస్థాపన చేసారు. ఆయన మాట్లాడుతూ సంక్షేమం, అభివృద్ధి కొనసాగేందుకు వైకాపా ప్రభుత్వాన్ని తిరిగి ఎన్నుకోవాల్సిన అవశ్యం ఎంతైన ఉందన్నారు. ఏ ప్రభుత్వంలో జరగని అభివృద్ధి జగనన్న ప్రభుత్వంలో జరిగిందని తెలిపారు. ప్రతిపల్లే, ప్రతివీధి, ప్రతి ఇళ్లు అభివృద్ధికి వైకాపా ప్రభుత్వం సంకల్పించిందన్నారు. ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ప్రజా అవసరాలను గుర్తించి, ప్రజలకు అనుగుణంగా పంచాయతీల్లో సిమెంట్ బెంచ్‌లు, రచ్చబండలు నిర్మాణంతో పాతరోజులను గుర్తు చేస్తూ పల్లె ప్రజల మనస్సులు దోచుకున్నారని తెలిపారు. ఇప్పటికే ఎమ్మెల్యే చెవిరెడ్డి నియోజకవర్గం ప్రజల కోసం ఎనలేని సేవలు అందించారని తెలిపారు.

## కవయిత్రి మొల్లమాంబ జీవితం ఆదర్శనీయం

నగరపాలక సంస్థ మేయర్ డాక్టర్ శిరీష

తిరుపతి కార్పొరేషన్, మార్చి 13, ప్రభాతవార్త



రామాయణం రచయించిన తొలి తెలుగు కవయిత్రి మొల్లమాంబ జీవితం అందరికీ ఆదర్శనీయమని తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ డాక్టర్ శిరీష అన్నారు. మొల్లమాంబా జయంతి సందర్భంగా తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో బుధవారం మొల్లమాంబ చిత్రపటానికి పూలు సమర్పించి, కొబ్బరికాయలు కొట్టి స్మరించుకోవడం జరిగింది. ఈ సందర్భంగా మేయర్ డాక్టర్ శిరీష మాట్లాడుతూ తెలుగులో మొల్ల రామాయణం ప్రసిద్ధి చెందిన రామాయణంను వ్రాసిన కవయిత్రి మొల్లమాంబ 16వ శతాబ్ధంలో శ్రీ కృష్ణదేవ రాయుల కాలంలో మొల్లమాంబా జీవించిందని ప్రసస్థి. ఆనాటి కాలంలోనే కవయిత్రి మొల్ల రచనలు ప్రసిద్ధికెక్కిందన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, ఉప కమిషనర్ అమరయ్య, రెవెన్యూ అధికారి సేతుమాధవ్, మేనేజర్ చిట్టిబాబు, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్ రెడ్డి, ఫైర్ ఆఫీసర్లు శ్రీనివాసరావు, శ్రీనాథ్ రెడ్డి, మున్సిపల్ ఇంజనీర్ వెంకట్రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నిత్యాన్న ప్రసాదానికి విరాళం

శ్రీకాళహస్తి, మార్చి 13 ప్రభాతవార్త



శ్రీకాళహస్తీశ్వరాలయంలో పారదర్శకతతో నిర్వహిస్తున్న నిత్యాన్న ప్రసాదానికి విరాళాన్ని అందుతున్నాయి. ఈ నేపథ్యంలో బుధవారం శ్రీకాళహస్తికి చెందిన ఏ.హేమంత్ కుమార్ కుటుంబసభ్యులతో పూజలు జరుపుకున్నారు. తరువాత నిత్యాన్న ప్రసాదానికి విరాళం అందించుటకు అధికారులకు వివరించారు. ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక నాగేశ్వరరావుకు రూ.50వేలు విరాళాన్ని శ్రీనివాసులు సమక్షంలో హేమంత్‌కుమార్ ఇఓ అందించారు. వారికి ప్రత్యేక దర్శనం ఏర్పాటు చేసారు.

# తిరుపతి డివిజన్

## టిడిపి మద్దతుదారుల మృతుల కుటుంబాలకు ఎమ్మెల్యే సంతాపం

నారాయణవనం, మార్చి 13 ప్రభాతవార్త :



సత్యవేడు నియోజకవర్గంలోని నారాయణవనం, సత్యవేడు మండలాలకు చెందిన టిడిపి మద్దతుదారులు బుధవారం మృతి చెందారు. నారాయణవనం మండలం భీమునిచెరువు గ్రామానికి చెందిన ఎరికంబట్టు గుర్రప్ప, సత్యవేడు మండలం శిరనంబూదూరు గ్రామానికి చెందిన యంపిటీసి సుధాకర్ తండ్రి మోసస్ మృతి చెందారు. వీరి మృతి వార్త తెలుసుకున్న సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం మృతదేహాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఆయనతో పాటు నారాయణవనం మాజీ ఎంపిపి పి,గోవిందస్వామి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## నిర్భయంగా మీ ఓటు హక్కును వినియోగించుకోండి :

నారాయణవనంలో పోలీసు కవాతులో డీఎస్పీ

నారాయణవనం, మార్చి 13 ప్రభాతవార్త :



ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరు తమతమ ఓటు హక్కును నిర్భయంగా ఉపయోగించుకోవాలని పుత్తూరు డీఎస్పీ శ్రీనివాస రావు కోరారు. బుధవారం మండలంలోని తిరువట్యం, నారాయణవనం, కీళగరం గ్రామాల్లో పోలీసు కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా పుత్తూరు డీఎస్పీ శ్రీనివాసరావు మాట్లాడుతూ 18 సంవత్సరాలు పూర్తయి ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరు ఎలాంటి ఈ కార్యక్రమంలో ట్రైనీ డీఎస్పీ ఇందుప్రియ, బిఎస్‌ఎఫ్ డీఎస్పీ జితేంద్ర, పుత్తూరు రూరల్ సిఐ భాస్కర్‌నాయక్, ఎస్ఐ డి లక్ష్మీనారాయణ, ఎఎస్ఐలు జయరాంనాయక్, ఆశీర్వాదం, శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.

## కోలా గెలుపు కోసం బీజేపీ శ్రేణుల ప్రచారం

రేణిగుంట, మార్చి 13 ప్రభాతవార్త:



శ్రీకాళహస్తి నియోజకవర్గం బీజేపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న కోలా ఆనంద్ కుమార్‌గెలుపు కోసం బీజేపీ పార్టీ నేతలు రేణిగుంట మండలం గుండాల కాలువ గ్రామంలో బుధవారం ఇంటింటికి తిరిగి ప్రచారం చేశారు. మోదీ దేశం కోసం చేస్తున్న సేవలను వివరిస్తూ అందుకు సంబంధించిన క్యాలెండర్లు, కరపత్రాలు ఇంటింటికి అందజేశారు. దేశానికి మోదీ నాయకత్వం ఎంతో అవసరం ఉందని వివరించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బీడీ బాలాజీ, రేణిగుంట మండల బీజేపీ అధ్యక్షురాలు తేజోవతి, బీజేపీ మండల ఇన్‌చార్జి లింగారెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శులు పజారి ప్రేమ్‌కుమార్‌రెడ్డి, ఏకాంబరం, వెంకటేష్‌రెడ్డి, బీజేపీ మండల యువ మోర్చా ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్, వేణుగోపాల్, యోగేశ్వర్, రామకృష్ణపాల్గొన్నారు.

## సదాశివకోన మహా శివరాత్రి ఆదాయం రూ.12.36 లక్షలు

వడమాలపేట, మార్చి 13 ప్రభాతవార్త:

మహా శివరాత్రి సందర్భంగా మండలంలోని సదాశివకోనకు రూ.12.36లక్షలు ఆదాయం వచ్చినట్టు ట్రస్టు బోర్డుచైర్మన్ జయచంద్రన్ తెలిపారు. బుధవారం వడమాలపేటలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ మహా శివరాత్రిఉత్సవాలను ఘనంగా నిర్వహించినట్లు తెలిపారు. కామాక్షి, సదాశివునికి తలనీలాల వేలం ద్వారా రూ.1.73 లక్షలు, ప్రత్యేక దర్శనం, సర్వ దర్శనం, అభిషేకం, సేవా టికెట్ల ద్వారా రూ.1.97 లక్షలు, హుండీల ద్వారా రూ.8.66.000లు ఆదాయం వచ్చిందన్నారు. అమ్మవారి హుండీలో అజ్ఞాత భక్తుడు ప్రభుత్వం రద్దుచేసిన రెండు వేలు నోట్లు 75 వేసినట్లు తెలిపారు. సమావేశంలో ఈవో రామచంద్రారెడ్డి, ప్రత్యేకాధికారి సుబ్రహ్మణ్యం నాయుడు, ట్రస్టు బోర్డు సభ్యులు గోపి రమణ, వాసుదేవరెడ్డి, ఉదయ్‌కుమార్‌లు పాల్గొన్నారు.

## జిల్లా ఖజానా కార్యాలయం ఎదుట పెన్షనర్లు సంఘం ధర్నా



పుత్తూరురూరల్, మార్చి 13 ప్రభాతవార్త: సుమారు 35 సంవత్సరాలు పాటు సమాజానికి వివిధ హోదాల్లో సేవలు అందించి విశ్రాంతి జీవనంలో ప్రశాంతంగా జీవించాలంటే ప్రతి నెల పెన్షన్ అవసరం అటువంటిపెన్షనర్లకు ఆదాయపు పన్ను పరిధిలోకి రాకపోయినా కక్ష సాధింపుతో పుత్తూరు ఎస్‌టీవో, వారి సిబ్బంది వ్యవహరిస్తున్నారని, వారిపై తక్షణం చర్యలు తీసుకుని పెన్షనర్లకు న్యాయం చేయాలని రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం నాయకులు తిరుపతి జిల్లా ఖజానా కార్యాలయానికి వెళ్లి ధర్నా నిర్వహించారు. పుత్తూరు ఎస్‌టీవోలో ఆదాయపు పన్ను పరిధిలోకి రాని విశ్రాంత ఉద్యోగులకు సైతం అసంబద్ధంగా, నిర్లక్ష్యంగా నిరదాక్షిణ్యంగా 500పై చిలుకు పెన్షనర్స్‌కు ఇన్‌కాం టాక్స్‌ను డెక్ట్ చేయడం శోచనీయమన్నారు. నెలకు 46 వేలు పెన్షన్ పొందుతున్న పెన్షనర్ కూడా ఏకమొత్యంగా 40 వేలు అక్రమంగా ఇన్‌కాం టాక్స్ పేరుతో రికవరీ చేసి పెన్షనర్లకు తీవ్రమైన వేదనను పుత్తూరు ట్రెజరీ సిబ్బంది కలిగించారని తెలిపారు. పుత్తూరు ఖజానా అధికారి, సంబంధిత సిబ్బందిపై వెంటనే చర్యలు చేపట్టి పెన్షనర్లకు న్యాయం చేయాలన్నారు. పెన్షన్ సంఘం నాయకులు శంకరు, గోపాల్, జయరాంనాయుడు, యుగంధర్‌రాజు, కృపావరమ్మ, రవిశంకర్, జిల్లా అధికారులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు కె.ఆర్.శంకర్, ప్రధాన కార్యదర్శి జయరాంనాయుడు, జిల్లా సహాధ్యక్షులు యుగంధర్‌రాజు, టి.గోపాల్, జిల్లా సంఘటన కార్యదర్శి రవిశంకర్, రాష్ట్ర మహిళా కార్యదర్శి కృపావరమ్మ, పుత్తూరు పెన్షనర్లసంఘం నాయకులు కుప్పయ్య, గుణశేఖర్‌రెడ్డి, అరుణాచలంరెడ్డి, మోహన్‌శెట్టి, మురహరి, తిరుపతి నగర్ శాఖ ప్రధాన కార్యదర్శి వెంకటేశంశెట్టి, కోశాధికారి నగర శాఖ అధ్యక్షుడు సి.టి.ఆర్.సురేష్‌బాబు, ఎస్.జి.మునికృష్ణ, కార్యవర్గ సభ్యులు సుబ్రహ్మణ్యం, తదితర పెన్షన్ సంఘం నాయకులు పాల్గొన్నారు.

## ఊపందుకుంటున్న బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమాలు

విజయపురం, మార్చి 13 ప్రభాతవార్త:



మండలంలో బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమాలు బుధవారం ఊపందుకుంది. ఈ కార్యక్రమంలో భాగంగా మాధవరంలో టీడీపీ సీనియర్ నాయకుడు జయరాజ్ సెల్వం, పన్నూరు దళితవాడలో టీడీపీ నాయకుడు శరత్, గొల్లకండ్రిగలో తెలుగు మహిళా అధ్యక్షురాలు గుణభూషణమ్మ, గొల్లకండ్రిగ దళితవాడలో మండల ఎస్సీసెల్ అధ్యక్షుడు మహేంద్రన్, జంబాడలో రవిరాజు వారి ఆధ్వర్యంలో భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మంచి ఆదరణ లభిస్తుందని గ్రామాల్లో మహిళలు, యువతటీడీపీ పక్షాన ఉన్నారని తెలిపారు. క్షూరికాపురంలో పలువురు మహిళలు పాల్గొన్నారు.

## మహిళా అభివృద్ధికి తమ సహకారం ఎప్పుడూ ఉంటుంది

నగరి, మార్చి 13 ప్రభాతవార్త:

మహిళాభివృద్ధికి తమ సహకారం ఎప్పుడూ ఉంటుందని యూనియన్ బ్యాంకు నగరి బ్రాంచి హెడ్ యువరాజ్, మేనేజర్ ఆర్డీవో నిత్య అన్నారు. బుధవారం పట్టణ పరిధి సిద్ధి వినాయక సత్యసాయి ఆలయంలో సత్య ఎస్‌హెచ్‌జీ సభ్యులు నిర్వహించిన మహిళా దినోత్సవ వేడుకల్లో వారు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. మహిళలకు మహిళా దినోత్సవ బహుమతులను అందజేశారు. మహిళల అభివృద్ధికి తమవంతు సహకారం ఎప్పుడూ ఉంటుందని మహిళలకు సూచించారు. రుణాలు పొందడంలో ఏ సమస్యలున్నా సందేహాలున్నా తమ దృష్టికి తెస్తే వెంటనే పరిష్కరిస్తామన్నారు.

## టిటిడి చైర్మన్‌ని కలిసిన స్విమ్స్ ఔట్ సోర్సింగ్ స్టాఫ్ నర్సులు

తిరుపతి హెల్త్, మార్చి 13, ప్రభాతవార్త



టిటిడి చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డిని పద్మావతి పురంలోని భూమన నివాసం వద్ద కృతజ్ఞతా పూర్వకంగా కలిసి సిమ్స్ ఔట్ సోర్సింగ్ స్టాఫ్ నర్సులు సత్కరించారు. నోటిఫికేషన్, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ద్వారా కాకుండా టిటిడి పాలక మండలి ఆమెదంతో పరిపాలనా సౌలభ్యం కోసం కాంట్రాక్ట్, పొరుగు సేవల కింద స్విమ్స్‌లో పనిచేస్తున్నారు. జీవో నెంబర్ 114 ప్రకారం నిబంధనలు సడలిస్తూ వారి సేవలను క్రమ బద్ధీకరించేలా టిటిడి పాలన మండలి సమావేశంలో తీర్మానించేందుకు రుణపడి ఉంటామని తెలిపారు. తమ జీవితాల్లో వెలుగులు నింపారని తమ సంతోషాన్ని వ్యక్తం చేసారు.

## ఇంజనీర్స్ అసోసియేషన్ డిస్కం కార్యవర్గం ఎన్నిక

తిరుపతి హెల్త్, మార్చి 13, ప్రభాతవార్త



ఏపీఎస్ఈబి ఇంజనీర్స్ అసోసియేషన్ డిస్కమ్ సెక్రటరీగా, ఉపాధ్యక్షులుగా ఎన్నికైన పుల్లా బాలాజీ, ఉ య్యాల రమేష్‌లు బుధవారం ఏపి ఎస్పీడీసీఎల్ సిఎండి కె.సంతోష రావును మర్యాదపూర్వకంగా కలిసా రు. ఈ సందర్భంగా సిఎండి సంతోష రావు మాట్లాడుతూ ఏపీఎస్ఈబి ఇంజనీర్స్ అసోసియేషన్‌లో ఎన్నికైన వారికి అభినందనలు తెలియజేసారు. అనంతరం ఏపీఎస్పీడీసిఎల్ డైరెక్టర్లు విఎన్ బాబు, ఎన్వీఎస్ సుబ్బరాజు, కె. శివప్రసాద్ రెడ్డిలను అసోసియేషన్ ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు మాధవ రావు, చింతం బాలాజి, భాస్కర్ నాయుడు, వేణుగోపాల్, గంగాధర్‌రెడ్డి, మునిప్రసాద్, జయప్రకాష్, లేడీ రెప్రజెంటేటివ్ స్వాతి, వెంకటలక్షిపాల్గొన్నారు.

## భక్తులకు మజ్జిగ పంపిణీ

శ్రీకాళహస్తి, మార్చి 13 ప్రభాతవార్త



మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం జరిగిన స్వామివారి ధ్వజావరోహణం కార్యక్రమం సందర్భంగా విచ్చేసిన భక్తులకు విశ్వగురువు శ్రీరామదూత స్వామి ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో భక్తులకు ఉచిత మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో ట్రస్టు నిర్వాహకులు పాల్గొన్నారు.

## 12వ రోజు పల్లకీసేవ 14.03.2024

ఫాల్గుణ శుద్ధ పంచమి గురువారం రాత్రి 8గం.లకు ప్రారంభం
ఉభయదాతలు: శ్రీ కండ్రిగ వెంకటరమణారావు గారు
శ్రీమతి కండ్రిగ ఉమ గారు. మాజీ ధర్మకర్తల మండలి సభ్యులు

**ధూర్జటి కళాప్రాంగణంలో నేడు :**

14.03.2024 గురువారం శ్రీస్వామిఅమ్మవార్ల పల్లకీసేవ
ఉ.8గం.నుంచి- దండిశ్రీనివాసులు, శ్రీకాళహస్తి వారిచే భక్తిరంజని
ఉ.9గం.నుంచి- యం.ఇప్సిత బృంద, శ్రీకాళహస్తి వారిచే నృత్యప్రదర్శన
ఉ.9.30గం.నుంచి-సిహెచ్.మోక్షశ్రీ, శ్రీకాళహస్తి వారిచే నృత్యప్రదర్శన
ఉ.10గం.నుంచి- పి.పూర్విశారెడ్డి, శ్రీకాళహస్తి వారిచే నృత్యప్రదర్శన
ఉ.10.30గం.నుంచి- బి.మోనిశ్రీ, శ్రీకాళహస్తి వారిచే నృత్యప్రదర్శన
ఉ.11గం.నుంచి- నందికేశ్వర నృత్య అకాడమీ, నెల్లూరు జ్యోత్స్న వారిచే నృత్యప్రదర్శన, ఉ.12గం.నుంచి-గిరిజా డ్యాన్స్ అకాడమీ, తిరుపతి యు.వి. సుప్రజ వారిచే నృత్యం, మ.1గం.నుంచి-పి.హరిత, శ్రీకాళహస్తి వారిచే నృత్యప్రదర్శన, మ.1.30గం.నుంచి-పి.శ్రేయాభాను, శ్రీకాళహస్తి వారిచే నృత్య ప్రదర్శన, మ.2గం.నుంచి- జి.ఇషితాశ్రీ, శ్రీకాళహస్తి వారిచే నృత్యప్రదర్శన
మ.2.30గం.నుంచి-యం.జాహ్నవి, శ్రీకాళహస్తి వారిచే నృత్యప్రదర్శన
మ.3గం.నుంచి-తీక్షణ చౌదరి, శ్రీకాళహస్తి వారిచే నృత్యప్రదర్శన
సా.3.30గం.నుంచి-పి.హేమస్య, నాయుడుపేట వారిచే నృత్యప్రదర్శన
సా.4గం.నుంచి-జి.కె.సుందరం, తిరుపతి వారిచే భక్తిరంజని
సా.5గం.నుంచి- మట్టే కుందనశ్రీ, శ్రీకాళహస్తి వారిచే నృత్యప్రదర్శన
సా.5.30గం.నుంచి-హెస్విక, నివేధిక తిరుపతి వారిచే నృత్యప్రదర్శన
సా.6గం.నుంచి- దేగల సాంబశివరావు, నెల్లూరు వారిచే నృత్యప్రదర్శన
సా.7గం.నుంచి-లాస్య ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కూచిపూడి డ్యాన్స్, కర్నూలు టివి.గంగాధరం వారిచే నృత్యప్రదర్శన
రా.8గం.నుంచి-రేలారే రేలా,హైదరాబాదు గెడ్డం గోవర్ధన్ వారిచే జానపద శివనృత్య గీతాలు, రా.9గం.నుంచి-గాయత్రి నృత్య నికేతన్, విజయవాడ, యం.గాయత్రి వారిచే నృత్యప్రదర్శన
రా.10గం.నుంచి-నటనంఫౌండేషన్, బెంగుళూరు కె.రవిచంద్రన్ బృందంచే నృత్యప్రదర్శన, రా.11గం.నుంచి-అరవింద్ ఆర్ట్స్ అకాడమీ, అనంతపూర్, సి.సూర్యప్రసాద్ వారిచే నృత్యప్రదర్శన
రా.12గం.నుంచి- శ్రీ సీతారామాంజనేయ నాట్యమండలి గుంటూరు వారిచే 'శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి జీవిత చరిత్ర నాటకం'.

## అదృష్టంగా భావించి ఎన్నికల విధులు

**- జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు**



చిత్తూరు, మార్చి 13 ప్రభాతవార్త: అధికారులు, సిబ్బంది అదృష్టంగా భావించి ఎన్నికల విధులను పక్కాగా నిర్వర్తించి పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు పేర్కొన్నారు. జడ్పీ సమావేశభవనంలో 2024 ఎన్నికల్లో భాగంగా పోలింగ్ రోజు పిఓలు, ఎపిఓలు నిర్వహించాల్సిన బాధ్యతలపై నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఈ సమావేశంలో జెసి మాట్లాడుతూ పిఓలు, ఎపిఓలు గతంలో ఎన్నికల విధులు నిర్వర్తించినా మళ్ళీ ఈ విధులు కొత్తగా వుంటాయన్నారు. పిఓలు, ఎపిఓలకు రెండు సార్లు శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఎన్నికల విధి విదానాలపై పిఓ హ్యాండ్ బుక్ పూర్తిగా చదివి అవగాహన కలిగి వుండాలని జెసి స్పష్టం చేశారు. తమ పరిధిలోని పోలింగ్ కేంద్రంలో అన్ని వ్యవహారాలను నియంత్రించే చట్టపరమైన అధికారం పిఓలకు వుంటుందన్నారు. పోలింగ్ సమయంలో పోలింగ్ కేంద్రంలో ఎన్నికలను స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా నిర్వహించేలా చేయడం పిఓల ప్రాథమిక బాధ్యత అన్నారు. ఎన్నికల విధులకు సంబంధించి ఎవ్వరికి మినహాయింపు వుండదన్నారు. గర్భవతులు, బాలింతలు, పూర్తిగా నడవలేని వారికి, డయాలసిస్, క్యాన్సర్ వంటి వారికి మాత్రమే ఎన్నికల విధుల నుండి మినహాయింపు వుంటుందన్నారు. ఈ శిక్షణ కార్యక్రమంలో శిక్షణ డిప్యుటీ కలెక్టర్ లక్ష్మీప్రసన్న, స్పెషల్ డిప్యుటీ కలెక్టర్ శివయ్య, సాంఘీక సంక్షేమ, సాధికారిత అధికారిణి డాక్టర్ రాజ్యలక్ష్మీ, బిసి సంక్షేమశాఖ ఇడి శ్రీదేవి, చిత్తూరు ఆర్డీఓ చిన్నయ్య, పిఓలు, ఎపిఓలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రశాంత ఎన్నికల నిర్వహణకు సహకారం

**- రాజకీయ పార్టీల ప్రతినిధులతో జిల్లా రెవెన్యూ అధికారి పుల్లయ్య**



చిత్తూరు, మార్చి 13 ప్రభాతవార్త: సార్వత్రిక ఎన్నికలు-2024ను ప్రశాంత వాతావరణంలో నిర్వహించి పూర్తి చేయడానికి రాజకీయ పార్టీలు పూర్తి సహకారం అందించాలని జిల్లా రెవెన్యూ అధికారి పుల్లయ్య రాజకీయ పార్టీల ప్రతినిధులను కోరారు. జిల్లా సచివాలయంలోని డిఆర్ఓ సమావేశపు హాలులో బుధవారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో డిఆర్ఓ పుల్లయ్య బుధవారం సమావేశం అయ్యారు. ఈ సమావేశంలో డిఆర్ఓ మాట్లాడుతూ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడనుండటంతో ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా రాజకీయ పార్టీలు సహకరించాలన్నారు. ఇవిఎంల వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని, పోలింగ్ కేంద్రాల్లో కనీస వసతుల చర్యలు చేపట్టామని, సరిహద్దు ప్రాంతాల్లోని పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్, వీడియోగ్రఫీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు మాట్లాడుతూ అంతర్‌రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టుల వద్ద కేంద్ర బలగాలను ఏర్పాటు చేయాలని, అక్రమ మద్యం రవాణాను అడ్డుకట్ట వేయాలని, మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమలులోని వచ్చిన వెంటనే వివిధ రాజకీయ పార్టీలు ఏర్పాటు చేసిన బ్యానర్లు, కటౌట్లు, ఫ్లెక్సీలు తొలగింపుపై సమన్యాయం పాటించాలని డిఆర్ఓను కోరారు. ఈ సమావేశంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు భాస్కర్(బిఎస్పీ), అట్లూరి శ్రీనివాసులు(బిజెపి), పరదేశి(కాంగ్రెస్), వి.సురేంద్రకుమార్(తెలుగుదేశం), ఉదయ్‌కుమార్(వైకాపా), ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## నల్లపరెడ్డి ఇంట మంత్రి పెద్దిరెడ్డి



కోట, మార్చి 13 ప్రభాతవార్త : రాష్ట్ర అటవీ, భూగర్భగనులశాఖ మంత్రి పెద్దిరెడ్డి రామ చంద్రారెడ్డి బుధవారం కోటలో రాష్ట్ర వైసీపీ జాయింట్ సెక్రటరి నల్లపరెడ్డి వినోద్‌కుమార్‌రెడ్డి ఆహ్వానం మేరకు ఆయన ఇంటికి వచ్చారు. వాకాడులో దివంగత మాజీ ముఖ్యమంత్రి నేదురు మల్లి జనార్ధన్‌రెడ్డి విగ్రహావిష్కరణ అనంతరం కోటలో నల్లపరెడ్డి వినోద్ కుమార్‌రెడ్డిని కలిశారు. ఆయన వెంట ఎంఎల్‌సిలు బల్లి కల్యాణ చక్రవర్తి, మేరిగ మురళీధర్, వైసీపీ మండల కన్వీనర్ పలగాటి సంపత్‌కుమార్‌రెడ్డి, తిరుపతి జిల్లా వైసీపీ మహిళా జాయింట్ సెక్రటరీ సుధారెడ్డి, సిద్ధవరం సొసైటీ మాజీ ఛైర్మన్ సన్నారెడ్డి చెంచురాఘవరెడ్డి, యరటపల్లి మధుసూదన్‌రెడ్డి, చిల్లకూరు సాయిప్రసాద్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

## యాత్రికుల మౌళిక వసతుల కల్పనకు ప్రాధాన్యత : నాగరాజరెడ్డి



బోయకొండ(చౌడేపల్లి), మార్చి 13 ప్రభాతవార్త : శక్తిక్షేత్రం బోయకొండకు తరలివచ్చే యాత్రీకుల మౌళిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఆలయ ఛైర్మన్ నాగరాజరెడ్డి, ఇఒ చంద్రమౌళి అన్నారు. కొండకింద ఐసిఐసిఐ బ్యాంకు సేవా కేంద్రంతోపాటు కొండపై భక్తులకు మంచినీటి సౌకర్యం ఆర్ఓ ప్లాంటు ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలించారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో బోయకొండలో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలకు నాంది పలుకుతున్నట్లు వివరిం చారు. కొండకిందగల బోయకొండ గంగమ్మ వనం నుంచి కొండపైవున్న అమ్మవారి సన్నిధానం వద్దగల నీటిట్యాంకు వరకు రోఫ్‌వే పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకొంటున్నామన్నారు. అనంతరం ఆలయంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను గురించి వివరించారు. ఆలయ అధికార, సిబ్బంది పాల్గొన్నారు.

## యాగశాలలో కలశాల ఉద్వాసన

(శ్రీకాళహస్తి, ప్రభాతవార్త)



శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిర్వహిస్తున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం యాగశాలలో కలశోద్వాసన కార్యక్రమాలను నిర్వ హించారు. పది రోజుల పాటు వేదపండితులు వేద మంత్రాలతో పునీతమైన యాగశాలలోని కలశాలను ఉద్వాసన కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ఛైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు దంపతులు హాజరయ్యారు. ఆలయ అభిషేక ప్రధానార్చకులు డాక్టర్ స్వామినాధన్ గురుకుల్, ప్రధానార్చకులు సంబంధం గురుకుల్, పౌరోహితులు అర్ధగిరి, నిరంజన్, సురేంద్ర స్వామిలు కలశాలను తీసుకొని ఆలయంలో ప్రదర్శన నిర్వహించారు. కలశాలను భక్తులు భక్తి భావంతో దర్శించుకున్నారు. కార్యక్రమాలను ఆలయ ఎసి మల్లి కార్జున ప్రసాద్ పర్యవేక్షణలో ఎఇఓ ధనపాల్,సతీష్‌మాలిక్, సూపరిం టెండెంట్ నాగభూషణం యాదవ్, టెంపుల్ ఇన్స్‌పెక్టర్ సుదర్శనం పర్యవేక్షణలో కార్యక్రమాలు ముగిసాయి.

## గణనాధుని సన్నిధిలో విదేశీ భక్తుల సందడి



కాణిపాకం, మార్చి 13 ప్రభాతవార్త: సత్య ప్రమాణాలకు నెలవైన కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారి ఆలయంలో వివిధ దేశాలకు చెందిన విదేశీ భక్తుల బృందం బుధవారం సందడి చేశారు. అమెరికా, కెనడా, యూకె, నెదర్లాండ్, జర్మనీ,రష్యా తదితర దేశాలకు చెందిన 46 మంది భక్తులు బుధవారం కాణిపాకం ఆలయానికి చేరకుని స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ దర్శనార్థం వచ్చిన వారికి ఆలయ అధికారులు, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం వారు స్వామివారి సేవలో పాల్గొని ప్రత్యేకపూజలు చేశారు. వారికి వేదమంపడపంలో వేదపండితులు ఆశీర్వచనం చేసి స్వామివారి శేషవస్త్రాలను, ప్రసాదాలను అందజేశారు. అనంతరం శ్రీవీరాంజనేయ స్వామి ఆలయం, నవగ్రహ ఆలయంలలో కూడా పూజలు నిర్వహించారు. వారి వెంట టెంపుల్ ఇన్స్‌పెక్టర్ విఘ్నేష్ తదితరులు పాల్గొన్నారు.

## గీతాంజలి మృతికి కొవ్వొత్తుల ర్యాలీ



బంగారుపాళ్యం, మార్చి 13 ప్రభాతవార్త: తెలంగాణాకు చెందిన గీతాంజలి మృతికి సంతాపంగా బుధవారం రాత్రి బంగారు పాళ్యంలో వైకాపా నాయకులు కొవ్వొత్తులో ర్యాల చేపట్టారు. జగనన్న పాలనలో తన కుంటుంబానికి అందిన లబ్ది గురించి గీతాంజలి సమాజిక మాధ్యమాల ద్వారా సంతోషం వ్యక్తం చేసింది. ఈవిషయంపై తెలుగుదేశం, జనసేన నాయకులు గీతాంజలిపై అసత్య, అసభ్య ఆరోపణలు చేశారు. దీనితో గీతాంజలి ఆత్మహత్య చేసుకుంది. ఆమె మృతికి సంతాపంగా జిల్లా వ్యవసాయ సలహామండలి ఛైర్మన్ రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు.ఇందులో బంగారుపాళ్యం, తగ్గువారిపల్లె సర్పంచ్‌లు ఉమాదేవి కృష్ణమూర్తి, వాణిప్రియ, ఉపసర్పంచ్ కామరాజు, జిలా సేవాదళ్ అధ్యక్షుడు కిషోర్‌కుమార్‌రెడ్డి, పలువురు వైకపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## 2 కేజీల గంజాయి స్వాధీనం -పరారీలో వున్న నిందితుడు అరెస్టు



చిత్తూరు, మార్చి 13 ప్రభాతవార్త: చిత్తూరు టుటౌన్ పోలీసులు బుధవారం తిరుపతి-బెంగళూరు పాత బైపాస్ రహదారిలోని కాణిపాకం జంక్షన్ వద్ద 80 వేల రూపాయల విలువైన 2 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకొని ఒక వ్యక్తిని అరెస్టు చేశారు. టుటౌన్ ఇన్స్‌పెక్టర్ ఉలసయ్య బుధవారం పోలీస్ స్టేషన్‌లో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడుతూ చిత్తూరు నగరంలో గంజాయి అక్రమ రవాణాపై వచ్చిన సమాచారంతో నిందితులను పట్టుకోవడం కోసం తిరుపతి-బెంగళూరు బైపాస్ రోడ్డులో కాణిపాకం జంక్షన్ వద్ద పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారన్నారు. ఈ తనిఖీలో అటు వైపు ప్యాసింజర్ ఆటో నడుపుకొంటు వచ్చిన జి.రవికుమార్ (31) అలియాస్ ఆటో రవిని తనిఖీ చేయగా అతని ఆటోలు 80 వేల రూపాయల విలువైన 2 కేజీల గంజాయి లభ్యం అయ్యిందన్నారు. ఈ మేరకు ఆటోను సీజ్ చేసి ఆటో రవిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. అరెస్టయిన ఆటో రవి ఇది వరకు గంజాయి అక్రమ రవాణాలో పట్టుపడి అరెస్టయిన కేసులో మూడవ నిందితుడిగా వున్నాడని, ఇది వరకు ఇద్దరు నిందితులను అరెస్టు చేయడం జరిగిందన్నారు. వీరు వైజాగ్ నుండి అక్రమంగా గంజాయిని చిత్తూరుకు తీసుకువచ్చి ఇక్కడ ఎక్కువ ధరలకు విక్రయించి భారీ లాభాలను ఆర్జించేవారన్నారు. ఈ కేసులో అరెస్టయిన జి.రవికుమార్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించడం జరిగిందని, ఈ కేసులో గంజాయి స్మగ్లర్లను పట్టుకొన్న పోలీసు సిబ్బందిని డిఎస్పీ రాజగోపాల్ అభినందించినట్లు ఇన్స్‌పెక్టర్ ఉలసయ్య తెలిపారు.

## ఘనంగా కవయిత్రి మొల్ల జన్మదినోత్సవం



చిత్తూరు, మార్చి 13 ప్రభాతవార్త: జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో బుధవారం కలెక్టరేట్‌లో కవయిత్రి మొల్ల జన్మదినంను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డిఆర్ఓ పుల్లయ్య మొల్ల చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించి మాట్లాడుతూ మొల్ల తెలుగులో రామాయణం రచించారన్నారు. మొల్ల సంస్కృతంలోని రామాయణంను తెలుగులో రచించిందని, ఆమె రచనా శైలి చాలా సరళంగా వుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి రబ్బానీబాషా, ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## కుప్పంలో చేసిన అభివృద్ధి..సంక్షేమం వివరించే ఓట్లు అడుగుతాం

**- ఎమ్మెల్సీ, జిల్లా వైకాపా అధ్యక్షుడు భరత్**



కుప్పం, మార్చి 13 ప్రభాతవార్త : గత ఐదేళ్ల వైకాపా పాలనలో కుప్పంలో చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ప్రజలకు తెలియజేసే ఓట్లు అడుగు తామని ఎమ్మెల్సీ,జిల్లా వైకాపా అధ్యక్షుడు భరత్ పేర్కొన్నారు. బుధవారం మున్సిపల్ పరిధి ఒకటో వార్డు సామగుట్టపల్లి ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం గడపగడపకు మీ భరత్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కుప్పంలో 82039కుటుంబాలకు నవ రత్నాలు పథకాలు 93.29శాతం అందించా మన్నారు. వివిధ సంక్షేమపథకాల కింద కుప్పంలో మహిళల ఖాతాల్లోకి 1400కోట్లను సిఎం జగనన్నజమ చేశారన్నారు. ప్రతినెలా పింఛన్ల కింద 507కోట్లు అవ్వతాతలు, వితంతు, వికలాంగులకు అందిస్తున్నట్లు తెలిపారు. కుప్పం మున్సిపాలిటీలో 66కోట్లతో అభివృద్ధి పనులు చేపటినట్లు పేర్కొన్నారు. చంద్రబాబు పాలనలో అసంపూర్తిగా మిగిలిన హంద్రీ-నీవా కాలువల నిర్మాణం పూర్తి చేసి కృష్ణా జలాలు కుప్పందాకా తెచ్చామన్నారు. మరో 535కోట్లతో రెండు చోట్ల రిజర్వాయర్ల నిర్మాణానికి నిధులను సిఎం జగన్ మంజూరు చేశారన్నారు. గడపగడపకు నిధులతో గ్రామాల్లో అవసరమైన చోట్ల సిసి రోడ్లు, తారు రోడ్లు ఏర్పాటుచేశామన్నారు. గ్రామాల్లో సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, విలేజ్ హెల్త్ క్లినిక్‌లు ఏర్పాటు చేశామన్నారు. కుప్పం అభివృద్ధికి తాము కట్టుబడి ఉన్నామని తనకు ఎమ్మెల్యేగా అవకాశం కల్పించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ భరత్ సతీమణి దుర్గ పద్మిని, మున్సిపల్ ఛైర్మన్ డా॥ సుధీర్, వైస్ ఛైర్మన్లు మునస్వామి, హఫీజ్, కౌన్సిలర్లు, నేతలు పత్రాల మునిరత్నం, సిపి మనోహర్, ఎపిసిఎస్‌సి డైరెక్టర్ శ్రీనివాసమూర్తి, స్థానిక నేతలు పాల్గొన్నారు.

## వెంగమనాయుడు కుంట సంరక్షణకు పోరాటం

**- కుంట పరిసరాల్లో నిలబడి నిరసన వ్యక్తం చేసిన రైతులు**



ఎస్ఆర్‌పురం, మార్చి 13 ప్రభాతవార్త: మండల పరిధిలో కటికపల్లి గ్రపంచాయతీ 48 బసివిరెడ్డి పల్లి లెక్క దాఖలు సర్వేనెం.119/7లో 1.14 ఎకరాల వెంగమ నాయుడు కుంటను సంరక్షిం చుకోవడానికి స్థానిక రైతులు పోరాట బాట పట్టారు. ఈ కుంటను ఎలాంటి పరిస్థితుల్లోను ఇతర పనులకు ఉపయోగించరాదని, కుంటను కుంటలాగే వుంచాలని అక్కడి రైతులు కోరుతూ కుంట ఆవరణలో బుధవారం నిరసన కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. ఇక్కడ కుంట తమ తాత ముత్తాతల కాలం నుండి వుందని ఈ కుంటలో ఎల్లప్పుడు నీరు వుండటంతో పరిసర ప్రాంతాల్లోని బావులు, బోర్లలో నీటి ఊట వుంటుందన్నారు. స్మశానం కోసం స్థలంను ఎక్కడైనా అటవీ ప్రాంత పరిసరాల్లో చూసుకోవాలని మంచినీటి కుంటగా వున్న ప్రాంతంను పూడ్చి స్మశానం ఏర్పాటు చేస్తే తాము సహించమని రైతులు స్పష్టం చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో రైతులు బాబునాయుడు, చిన్నస్వామినాయుడు, చంద్రయ్య, రాజేంద్రయ్య, భాగ్యలక్ష్మీ, ఆనందమ్మ, రాఘవేంద్ర, చంద్రశేఖర్‌నాయుడు, కటికపల్లి రైతులు, తదితరులు పాల్గొన్నారు.

## చంద్రబాబు సమక్షంలో తెదేపాలో చేరికలు



కుప్పం, మార్చి 13 ప్రభాతవార్త : తెదేపా అధినేత చంద్ర బాబు నాయుడు సమక్షంలో కుప్పం, శాంతిపురం మండ లాలకు చెందిన పలువురు వైకాపా కార్యకర్తలు, ప్రజాప్రతి నిధులు తెలుగుదేశం పార్టీలో చేరారు. బుధవారం ఉండవల్లి లోని చంద్రబాబు నివాసంలో ఈ కార్యక్రమం జరిగింది. కుప్పం తెదేపా విస్తరణ కమిటీ సభ్యుడు కె.కన్నన్ ఆధ్వర్యంలో దళిత నేత కందస్వామి కుమారుడు సురేష్, అతని అనుచరులు పదిహేను మంది తెదేపాలో చేరారు. అలాగే కుప్పం మండల టిడిపి అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్, రాష్ట్ర నేత శాంతారాంల అధ్వర్యంలో వసనాడు, పిబినత్తం, నడిమూరుకు చెందిన మరో పదిమంది చంద్రబాబు సమక్షంలో తెదేపాలో చేరారు. వీరిని చంద్రబాబు పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. సర్పంచ్ రోహిత్ రవి, నేతలు వల్లెప్ప,రాజశేఖర్ లు పాల్గొన్నారు.

## కవయిత్రి మొల్లమాంబ విగ్రహానికి పాలాభిషేకం



తిరుపతి,మార్చి 13ప్రభాతవార్త: సంస్కృతంలో ఉన్న రామాయణాన్ని తెలుగుభాషలోకి అనువదించిన తొలి తెలుగు కవయిత్రి మొల్లమాంబ జీవితం మహిళలకు ఆదర్శనీయమని రాయలసీమ రంగస్థలి ఛైర్మన్ గుండాల గోపీనాధరెడ్డి పేర్కొన్నారు.కవయిత్రి మొల్లమాంబ 529వ జయంతి వేడుకలను బుధవారం రాయలసీమ రంగస్థలి ,మొల్లమాంబ కళాపీఠం సంయుక్తంగా జరుపుకుంది. విగ్రహానికి పాలాభిషేకం చేసి పుష్పాలంకరణతో అంజలి ఘటించారు. 2017లో భారత ప్రభుత్వం మొల్లమాంబ జ్ఞాపకార్థం తపాళ బిళ్ళపై ఆమె చిత్రాన్ని ముద్రించిందన్నారు.ఈ కార్యక్రమంలో రాయలసీమ రంగస్థలి ,మొల్లమాంబ కళాపీఠం నేతలు గుండాల గోపీనాధరెడ్డి, కేశవ ఒడియార్, కెఎన్ రాజ, తొండమనాటి సుబ్రమణ్యంరెడ్డి, సురేష్‌స్వామి, రవియాదవ్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## కారూరుమిట్టలో నగదు, నగలు అపహరణ

తడ, మార్చి 13 ప్రభాతవార్త : తడ మండలం కారూరు పంచాయతీ పరిధిలోని కారూరుమిట్టలో రాకపాలెం సుధాకర్ ఇంట్లో దొంగతనం జరిగినట్లు బుధవారం పోలీసులకు ఫిర్యాదు అందింది. ఈ నెల 11న సుధాకర్ కుటుంబ సభ్యులు తమిళనాడులో తీర్థయాత్రలకు వెళ్లి బుధవారం తిరిగి వచ్చేసరికి ఇంట్లో చోరీ జరిగినట్లు గుర్తించారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు, బుధవారం తెల్లవారుజామునే ఈ సంఘటన జరిగినట్లు పేర్కొన్నారు. ఇంటి వద్ద కుక్కలు అరుస్తుండగా పొరుగునే ఉన్న ఫిర్యాది తండ్రి ఇంటి వద్దకు వెళ్లేసరికి మెయిన్ డోర్లు పెద్దకత్తితో పగులగొట్టి తలుపు తెరిచి ఉండగా గుర్తించాడు. ఇంట్లో ఉన్న బీరువా లాకర్, మంచం డ్రాలలో కూడా ఉన్న నగలు, నగదు అపహరించుకెళ్లినట్లు సుధాకర్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. సుమారు 11 సవర్ల బంగారు ఆభరణాలతో పాటు రూ.50 వేల నగదు చోరీకి గురైనట్లు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ సి.నరసింహారావు ఆధ్వర్యంలో పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## శివయ్య ఆజ్ఞలేనిదే ఏదీ జరగదు

**-శత సహ్రస్రావధాని మేడసాని మోహన్**



శ్రీకాళహస్తిరూరల్, మార్చి 13 ప్రభాతవార్త : శ్రీకాళహస్తి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ధూర్జటి కళాప్రాంగణంలో నిర్వహిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా అన్నమాచార్య ప్రాజెక్టు డైరెక్టర్ శత సహస్రావధాని మేడసాని మోహన్ ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీకాళహస్తి వైభవం ప్రవచనం ఆకట్టుకుంది. శివతత్వం గురించి ఎంతో చక్కగా వివరించడంతో పాటు వాయులింగేశ్వరుడగా శ్రీకాళహస్తిలో ఎందుకు అవతరించాడో చక్కగా వివరించారు. కాగా విశ్వవిఖ్యాత హాస్యరస సార్వభౌమ, హాస్య బ్రహ్మ డా.శంకర్‌నారాయణ, హైదరాబాదు వారిచే హాస్యావధాన కార్యక్రమం, విజయవాడ వారి భవిరిరవి కార్యక్రమం, శ్రీవినాయక నాటక కళామండలి రేణిగుంటకు చెందిన కె.నాథమునిరెడ్డిచే శివలీలలు నాటకం ఆకట్టుకున్నాయి. కళాకారులకు ఇఓ ప్రశంసాపత్రాలతో పాటు మెమొంటోలను అందించి అభినందించారు.

## చిత్తూరు డివిజన్ ప్రభుత్వ ఖాజీగా మీర్జా ఆలీ అక్బర్

చిత్తూరు, మార్చి 13 ప్రభాతవార్త: చిత్తూరు డివిజన్ ప్రభుత్వ ఖాజీగా మీర్జా ఆలీ అక్బర్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గంగాధరనెల్లూరు మండలం అబ్బాస్ నగర్‌కు చెందిన మీర్జా ఆలీ అక్బర్ 10 సంవత్సరాల పాటు ప్రభుత్వ ఖాజీగా కొనసాగనున్నారు. తనను ఖాజీగా నియమించడానికి సహకరించిన డిప్యూటీ సిఎం నారాయణస్వామి, ఇతర వైకాపా నాయకులకు మీర్జా ఆలీ అక్బర్ కృతజ్ఞతలు తెలిపారు.

## కాణిపాకం ఆలయానికి 1.13 కోట్లు ఆదాయం



కాణిపాకం, మార్చి 13 ప్రభాతవార్త: కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారి దేవస్థానంకు హుండీ లెక్కింపు ద్వారా 1.13 కోట్లు రూపాయలు ఆదాయంగా వచ్చింది. బుధవారం స్థానిక ఆస్థాన మండపంలో ఆలయ ఛైర్మన్ ఎ.మోహన్‌రెడ్డి, ఈఓ వెంకటేశుల ఆధ్వర్యంలో ఆలయ హుండీలను లెక్కించారు. ఈసందర్భం గా 19 రోజులకు గాను హుండీల ద్వారా 1,13,03,666 రూపాయలు ఆదాయంగా లభించింది. అలాగే 100 గ్రాముల బంగారు, 670 గ్రాముల వెండి ఆదాయంగా వచ్చింది. అలాగే గోసంరక్షణ హుండీ ద్వారా 10,900 రూపాయలు ఆదాయంగా వచ్చింది. నిత్యాన్నదాన హుండీ ద్వారా 32,666 రూపాయలు, ప్రచారరథం హుండీ ద్వారా 5,589 రూపాయలు ఆదాయంగా లభించింది. దీనితో పాటు 70 అమెరికా డాలర్లు, 210 కెనడా డాలర్లు, 2 సింగపూర్ డాలర్లు, 20 ఇంగ్లాండ్ ఫౌండ్స్,60 న్యూజిలాండ్ డాలర్లు ఆదాయంగా వచ్చింది. ఈ హుండీ లెక్కింపు కార్యక్రమంలో ఏఈఓలు ఎస్వీ,కృష్ణారెడ్డి, రవీంద్రబాబు,విద్యాసాగర్‌రెడ్డి, ధనుంజయ, సూపరెండెంట్‌లు కోదండపాణి, శ్రీధర్‌బాబు, కాణిపాకం యూనియన్ బ్యాంకు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

## కైలసగిరి కొండల్లో భారీ మంటలు



శ్రీకాళహస్తి రూరల్ మార్చి 13 ప్రభాతవార్త : శ్రీకాళహస్తి కైలసగిరి కొండల్లో బుధవారం మధ్యాహ్నం భారీ ఎత్తున్న మంటలు చెలరెగాయి. దీంతో తుఫాన్‌సెంటర్‌కు మంటలు వ్యాపిం చడంతో అక్కడున్న నిర్వాహకుల తీవ్ర ఆందోళన నెలకొంది.వెంటనే సమాచారం అందుకున్న ఆలయ ఛైర్మెన్ శ్రీనివాసుల ఆధ్వర్యంలో ఫైర్ సిబ్బందిని రప్పించి మంటలార్పేందుకు తీవ్రంగా శ్రమించారు.ఓ వృద్ధురాలను రక్షించి అంగన్‌వాడీ భవనానికి మంటలు వ్యాప్తి చెందకుండా చర్యలు తీసుకున్నారు.వేసవి ఎండలు ప్రారంభదశలోనే కైలసగిరి కొనల్లో అకతాయిల చేష్టలతో అగ్నికి ఆహుతిఅవుతున్నాయి.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎండ కాలంలో మంటలు ఏర్పడి అగ్నిప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని ప్రతి ఒక్కరు పచ్చదనం పరిశుభ్రతను కాపాడాలని కోరారు. ఛైర్మెన్ మాట్లాడుతూ దేవస్థానం తరఫున రెండు ఫైరింజన్లను ఏర్పాటు చేసే దిశగా ప్రతిపాదనలు పంపుతామన్నారు.ఈ కార్యక్రమంలో డిప్యూటి ఇఓ ఏకాంబరం,శ్రీకాళహస్తి ఫైర్ సిబ్బంది,దేవస్థానం సిబ్బంది,ఆలయ సెక్యూరిటిలు పాల్గొన్నారు.

## గరుడవాహనంపై ప్రసన్నవెంటేశ్వరస్వామి



శ్రీకాళహస్తిరూరల్,మార్చి 13 ప్రభాతవార్త : శ్రీకాళహస్తి మండలం తొండమాన్‌పురంలో వెలసిన శ్రీదేవి,భూదేవి సమేత వెంకటేశ్వరస్వామి ఆలయంలో జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి స్వామి వారు గరుడ వాహనంపై స్వామి అమవార్లను గ్రామోత్సవం నిర్వహించారు.ఉదయం నుంచి ఆలయంలో స్వామి అమ్మవార్లకు అభిషేకాలు నిర్వహించారు. ఉదయం నుంచి చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు తరలి వచ్చారు. ఈ కార్యక్రమంలో డెప్యూటీ ఇఓ దేవేంద్రబాబు,టెంపుల్ ఇన్స్‌పెక్టర్ రవి,అర్చకులు రమణస్వామి,కృష్ణస్వామి, గోపి స్వామి, జయ స్వామిలు వెంటరాగా గ్రామానికి చెందిన కందాటిశేఖర్‌రెడ్డి, హరినాధ్‌రెడ్డి,జయచంద్రారెడ్డి తదితరులు రాగా గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం గ్రామంలో నిరుపేదలకు దుస్తులను పంపిణీచేశారు.

## జోరుగా ఇసుక అక్రమ రవాణా దందా

**- జిడి నెల్లూరు రీచ్ టు తమిళనాడు వయా పాలసముద్రం**

**- రోజుకు లక్షల మేరకు అక్రమార్జన- అధికారులకు వాటా వెళ్తుండటంతో పట్టించుకోని వైనం**



పాలసముద్రం, మార్చి 13 ప్రభాతవార్త: గంగాధరనెల్లూరు ఇసుక రీచ్ నుండి తమిళనాడుకు అనునిత్యం జోరుగా ఇసుక అక్రమ రవాణా చేసి రాజకీయ పార్టీ నేతల ముసుగులో స్మగ్లర్లు రోజుకు లక్షల రూపాయలు ఆర్జిస్తున్నారు. గంగాధరనెల్లూరు రీచ్ నుండి అక్రమంగా ఇసుకను డైరెక్ట్‌గా తమిళనాడుకు తీసుకెళ్ళడం పట్టపగలు సాధ్యం అయ్యే విషయం కాకపోవడంతో అక్రమా ర్కులు పక్కాగా ప్రణాళిక రచించారు. గంగాధరనెల్లూరు ఇసుక రీచ్ నుండి ట్రాక్టర్ల ద్వారా పాలసముద్రం మండలంలోని ఒక ప్రదేశానికి తరలించుకోవడం, అక్కడి నుండి సాయంత్రం తమిళనాడుకు తరలించడం చేసి రోజుకు లక్షల రూపాయలు దండుకొంటున్నారు. మండలంలో అధికార పార్టీకి చెందిన ఓ కీలక నేత ఇసుక అక్రమ రవాణాలో కీలక పాత్ర పోషిస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇతనికి మండలంలోని బలిజకండ్రిగ గ్రామంలోని పొలంలో ఇంటి నిర్మాణం జరుగుతుంది. ఈ ఇంటి నిర్మాణం పేరుతో జిడినెల్లూరు ఇసుక రీచ్ నుండి ప్రతి రోజు తన పొలంలో ఇసుకను డంప్ చేసుకొంటున్నాడు. ఇలా డంప్ చేసిన ఇసుక ఒక ట్రిప్పర్ రూ.15 నుండి రూ.20 వేల వరకు తమిళనాడుకు తరలించి అక్రమంగా ఆర్జిస్తున్నాడు. జిడినెల్లూరు ఇసుక రీచ్ నుండి తమిళనాడు రాష్ట్రానికి వయా పాలసముద్రం మండలం మీదుగా జోరుగా అక్రమంగా ఇసుక రవాణా అవుతున్నప్పటికీ దీని గురించి ఏ ఒక్క అధికారి నోరు మెదపడం లేదు. ఇసుక అక్రమ రవాణా చేసే వారిని పంచాయతీ సెక్రటరీ, గ్రామ రెవెన్యూ అధికారి స్థాయి నుండి తహసిల్దారు, ఎంపిడిఓలు, పోలీస్ కానిస్టేబుల్ స్థాయి నుండి ఎస్ఐ స్థాయి వరకు ఎవరైనా పట్టుకోవచ్చు. అలాగే మైనింగ్, సేల్స్‌టాక్స్ తదితర శాఖల అధికారులు సైతం పట్టుకోవచ్చు. అయితే ఏ ఒక్కరు ఈ విషయం జోలికి వెళ్ళడం లేదంటే ఇసుక అక్రమార్జనకు పాల్పడుతున్న అధికార పార్టీకి చెందిన నేత కింది స్థాయి నుండి పై స్థాయి అధికారుల వరకు ముడుపులు చెల్లించి తన కనుసన్నుల్లో వుంచుకొని ఇసుక అక్రమ రవాణాను యధేచ్ఛగా సాగిస్తూ లక్షల రూపాయలు ఆర్జిస్తున్నాడు. ఇకనైనా అధికారులు స్పందించి ఇసుక అక్రమ రవాణా జరుగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకొంటారని ఆశిద్దాం.


### అరగొండ గ్రామపంచాయతీ కార్యాలయము, అరగొండ

రె.క.నెం.09/2024. తేది: 13-03-2024.

**బహిరంగ వేలము ప్రకటన**

ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయునది ఏమనగా అరగొండ గ్రామపంచాయతీకి చెందిన వారపు సంత మరియు దినసరి సంత యందు రుసుములను వసూలు చేసుకొను గుత్త హక్కులను, మరియు గ్రామ పంచాయతీకి చెందిన వాణిజ్య సముదాయముల రూము నెం:01,02,03, 04,05,మరియు06నెంబర్లును (ఆరుగదులు మాత్రమే) 2024- 2025 ఆర్థిక సంవత్సరమునకు లీజు ఇచ్చుట కొరకు తేది: 20-03-2024బుధవారం ఉదయం 10.30 గంటలకు అరగొండ గ్రామపంచాయతీ కార్యాలయం నందు సదరు గ్రామ పంచాయతీ కార్యదర్శిగారిచే బహిరంగ వేలము వేయబడును. వేలములో పాల్గొను వారు ఈ క్రింది కనిన మేరకు డిపాజిట్లును పంచాయతీ కార్యదర్శి వారి వద్ద చెల్లించ వలయును.

| వ.నెం | గుత్త వివరములు | డిపాజిట్ మొత్తం | సాల్వెన్సీ మొత్తం | సాల్వెన్సీ లేనిచో డిపాజిట్టు మొత్తం |
|---|---|---|---|---|
| 01. | దినసరి మార్కెట్టు | 1,00,000 | 1,00,000 | 2,00,000 |
| 02. | వారపు కూరగాయల సంత | 1,25,000 | 1,25,000 | 2,50,000 |
| 03. | షాపింగ్ కాంప్లెక్స్ (1వ గది) | 25,000 | 25,000 | 50,000 |
| 04. | షాపింగ్ కాంప్లెక్స్ (2వ గది) | 25,000 | 25,000 | 50,000 |
| 05. | షాపింగ్ కాంప్లెక్స్ (3వ గది) | 25,000 | 25,000 | 50,000 |
| 06. | షాపింగ్ కాంప్లెక్స్ (4వ గది) | 25,000 | 25,000 | 50,000 |
| 07. | షాపింగ్ కాంప్లెక్స్ (5వ గది) | 25,000 | 25,000 | 50,000 |
| 08. | షాపింగ్ కాంప్లెక్స్ (6వ గది) | 25,000 | 25,000 | 50,000 |

షరతులు:- (1) జిల్లా పంచాయతీ అధికారి చిత్తూరు వారి ఉత్తర్వు రె.క.నెం: 63/2024/ఎ3, 64/2024/ఎ3 తేది 11-03-2024 హెచ్చు పాటదారులు వేలము ఖాయపరచిన తేదీ నుండి (7) రోజులు లోపు వారిచే పాడబడిన హెచ్చు పాట మొత్తమును ఏక మొత్తములో (సింగిల్ పేమెంట్) చెల్లించి మరియు నూటికి రూ.3/- వంతున స్టాంపు డ్యూటీతో రిజిష్టర్ అగ్రిమెంట్ చేసుకొనవలయును మరియు టీ.డీ.ఎస్, జి.ఎస్.టీలు చెల్లించి తగు రశీదులు పొందవలయును. అట్లు తప్పిన ఎడల హెచ్చు పాటదారుని ధరావత్తును గ్రామ పంచాయతీ నిధికి దండుగ క్రింద జమ చేసి రెండవ పాటదారునికి ఖాయపరచబడును. (2) వేలములో పాల్గొను వారి తరపున ఆథరైజేషన్ వ్యక్తులను అనుమతించబడదు. (3)వేలములో పాల్గొనదలచిన వారు గ్రామపంచాయతీకి ఏలాంటి బాకీ వుండరాదు. (4) వేలమును ఏలాంటి కారణము చూపకనే నిలుపుదల చేయుటకు, గాని వాయిదా వేయుటకు, మరియు రద్దు చేయుటకు పంచాయతీ కార్యదర్శి వారికి పూర్తి అధికారములు కలిగియున్నారు. (5) ఇతర వివరములకు గ్రామ పంచాయతీ కార్యాలయము పనివేళలలో తెలుసుకొనవచ్చును.

శ్రీ టి.మల్లుదొరై, సర్పంచ్, అరగొండ గ్రామ పంచాయతీ
తవణంపల్లె మండలం.అరగొండ గ్రామపంచాయతీ, తవణంపల్లె మండలం.

శ్రీ పి.చైతన్యకుమార్, పంచాయతీ కార్యదర్శి